# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

జులై 2026

వెల : రూ. 10.00









By the grace of Babuji and the blessings of Amma, Sri Sri Hanumath Kali Vara Prasad Babu UK Trust conducted its first charity event in Leeds, preparing and distributing 100 dal-rice meal boxes along with fruits and water to homeless individuals. Volunteers also assisted in distributing clothes, restaurant food, and other essential items, extending compassionate service to the local community.

శ్రీ బాబూజీ అనుగ్రహం, అమ్మ ఆశీస్సులతో శ్రీ శ్రీ హనుమత్ కాళీ వరప్రసాద్ బాబు యూకే ట్రస్ట్ లీడ్స్‌లో తన తొలి సేవా కార్యక్రమా334న్ని నిర్వహించి, నిరాశ్రయులకు 100 దాల్-రైస్ భోజన ప్యాకెట్లతో పాటు పండ్లు మరియు నీటిని పంపిణీ చేసింది. ఈ సందర్భంగా వాలంటీర్లు దుస్తులు, రెస్టారెంట్ ఆహారం మరియు ఇతర అవసరమైన వస్తువులను కూడా పంపిణీ చేస్తూ స్థానిక సమాజానికి బాబూజీ సేవ అందించారు.

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 45 సంచిక 11
పేజీలు 44
జులై 2026

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed & Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో ............................. ....... పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట......................................... ................. 7
అర్థమనర్థం ...... ...... ..... ....... ...........................8
మంత్ర మహిమ................................................10
భగవద్గీత సాధన దీపిక ..............................12
శ్రీ మాతాజీవారి విదేశీ పర్యటన..........15
విద్యాపతి .......................... .......................... ..................16
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ......... 18
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 20
నారద భక్తి సూత్రములు ................ ..............22
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....24
మమకారం ......................................................25
మాయా విలాసం........................... ..................27
మాటకన్న మిన్న - మౌన భాష.............29
నిరీక్షణ ......................................................................32
శ్రీ గురుగీత .......................................... ........34
గురుకృప ......................................... .............36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
పూరి - కామాఖ్య యాత్ర...........................40
విష్ణు కథలు ...... ........................... ...................41

## శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్



14. *బ్రాహ్మణుడనని జందెమున్నదని*
*వేదాలనెల్ల నేర్చితినని విఱ్ఱవీగేవు*
*సమభావన నేర్వని విద్యలేలరా*
*కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥*

తా: కొంతమంది బ్రాహ్మణులు తామేదో జన్మతః వున్నతులమని, తమలాగా ఇతర కులాలవారు ఉపనయనానికి, వేదాధ్యయనానికి అర్హత లేనివారని, వారిలో కొందరు అంటరాని వారని ఇలా రకరకాలుగా తమ కులాన్ని, వంశాన్ని, విద్వత్తును చూసుకొని మిడిసిపడుతూ ఇతరులను నీచులుగా, అంటరానివారిగా, హీనంగా చూస్తూ ఉంటారు. భగవంతుడు తానే మనుష్యులను వారివారి గుణ కర్మలను అనుసరించి నాలుగు వర్ణాలుగా విభజించానని, అయితే ఈ విభాగాలు కేవలం సమాజం ఒక పద్ధతిలో నడవడానికి మాత్రమే తప్ప ఇందులో ఎటువంటి హెచ్చుతగ్గులు లేవని, విద్యావినయ సంపన్నుడైన బ్రాహ్మణుని నుంచి, ఆవు, ఏనుగు, కుక్క, ఆ కుక్కమాంసం వండుకుతినే వ్యక్తి ఇలా జాతి, నీతి, కుల, గోత్ర భేదాలు లేకుండా సర్వత్ర సమదృష్టి కలిగినవాడే నిజమైన పండితుడని విస్పష్టంగా, ఘంటాపథంగా తెలిపాడు. అయినా ఇంకా సమభావన నేర్చుకోనప్పుడు ఇంక ఎంత విద్య ఉండీ ఏమి లాభం?

1) భగవంతుడు ఏ భాషకు స్పందిస్తాడు?
2) మనం ఇంటిలోని పాత వస్తువులు ఎందుకు వదలలేము?
3) సర్వసమర్పణ గురించి ఏసుక్రీస్తు ప్రభువు ఏమి చెప్పారు?
4) కాళిదాసుకు కూడా ఉపమానానికి అందనిది ఏది?
5) సాక్షాత్తు పరమేశ్వరుడు ఏ కవి ఇంటికి సేవకుడిగా వచ్చాడు?
6) ఒక్క చూపులోనే నిషాదునిలో మార్పు ఎలా వచ్చింది?
7) దేనిని వదిలితే ముక్తి లభిస్తుంది?
8) ఒక కాకిని కొడితే రెండు కాకులు రావడం దేనికి సంకేతం?
9) మనం సంపాదించవలసిన ధనం ఏది?

*సమాధానాలు లోపలి పేజీలలో ............................*

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

8-11-1981

ఈరోజు ఉదయం శ్రీ బాబూజీ వాకింగ్ చేస్తున్నప్పుడు 'మీకు దగ్గు ఎలా వుందమ్మా?' అని ఒక భక్తురాలిని ప్రశ్నించారు. 'రాత్రి ఎక్కువగా ఉంటుంది. భోజనం కూడా చేయటంలేదు. దగ్గువచ్చి వాంతులు అవుతున్నాయి' అని చెప్పింది ఆ భక్తురాలు. 'అలాగా! అయితే రాత్రి భోజనం చేయండి చూద్దాం. ఎలా వాంతులు అవుతాయో' అన్నారు శ్రీ బాబూజీ.



ఇది ఇలా ఉండగా ఎదురుగా ఉన్న శివాలయం మీద ఒక కాకి వాలింది. పక్షులు గుడిమీద వాలి పాడుచేస్తాయండి అని చెప్తూ 'హూష్' అని ఆ కాకిని శ్రీ బాబు అదిలించారు. కాని అది కదలలేదు. డాక్టరు రాజు కూడా అలాగే అదిలించేసరికి యింకో రెండు కాకులు వచ్చి వాలాయి.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'చూశారా! ఒక కాకిని కొడితే రెండు కాకులు వచ్చి వాలాయి. అలాగే ఒక సంకల్పాన్ని జయిస్తే ఇంకా ఎన్నో సంకల్పాలు బయలుదేరతాయి. మనస్సు పాదరసమువలె చంచలమైనది. మనస్సు మానవుణ్ణి విషయాదులపైకి మరల్చి తర్వాత 'పిచ్చివాడా! నేను విషయాల మీదకు మరలమన్నాననుకో, అంత మాత్రం చేతనే నువ్వు విషయముల పైకి మరలాలా?' అని అంటుంది' అన్నారు.

శ్రీ బాబు ఇంకా మాట్లాడుతూ 'మనస్సు యొక్క స్వభావం అది. మానవుడిలో కామవాంఛ కలిగితే అది తీర్చుకుంటాడు. కాని భగవంతుని సాన్నిధ్యానికి వెళ్ళటానికి సోమరితనం అడ్డం వస్తుంది. రేపటినుంచి వెళ్దాంలే అని వాయిదా వేస్తాడు. కాని తీరా కామవాంఛ తీర్చుకొన్న తర్వాత ఏమిటి ఇలా జరిగింది? అనుకుంటాడు. పరమేశ్వరుడంతటివాడు మన్మధుడి బాణాలకి చలించలేదా! పరమాత్ముడే చలిస్తే మనము ఎంత? అని లౌక్యంగా తనని తాను సమర్థించుకుంటాడు.

సర్వవ్యాపకుడైన పరమాత్ముడు చలించటమేమిటి? ఆయన లేని స్థలము ఎక్కడ ఉంది. అటువంటప్పుడు చలనం ఎలా సాధ్యపడుతుంది. సర్వజగత్తుకు ఆధారమైనది పరమాత్మ వస్తువే కదా! అదే చైతన్యము.

కొంతమంది స్త్రీలు భర్త భగవత్సాన్నిధ్యానికి వెళతానంటే కళ్ళనీళ్ళు పెట్టుకుని వద్దంటారు. అదే సినిమాలకో, విషయాదులకో అయితే వారి స్వభావం వేరే విధంగా వుంటుంది" అన్నారు శ్రీ బాబు.

"మీరంతా యిలాగే ప్రేమగా ఉండాలి. ఒకరినొకరు ప్రేమించుకోవాలి. మీ మధ్య ఈర్ష్యద్వేషాలకు స్థానము ఇవ్వకూడదు. నాకు మీరంతా సమానమే కదా! ఉదాహరణకి మీలో యిద్దరిమధ్య సయోధ్య లేదనుకోండి. నాకు ఇద్దరూ సమానమే కదా! మీరు ఇరువురూ నా పుత్రులే కదా! మరి నేను ఎవరిని సమర్థించగలను? నేను మీలో ఎవరినీ ఏమీ అనలేను కాబట్టి మీ సమస్యలు మీరే పరిష్కరించుకోవాలి. మీరంతా చక్కగా సదవగాహన కలిగి ఉండాలి. రాజకీయనాయకులు పదవులకోసం పోట్లాడుకున్నట్లు మీరు కూడా తగవులాడుకుంటే ఎలా?' అన్నారు శ్రీ బాబు.

'మన ప్రజలు ఎందుకు దిగజారిపోతున్నారు? మన భాషను సంస్కృతిని గాలికి వదిలి పాశ్చాత్య సంస్కృతిని అనుకరిస్తున్నారు. వచ్చీరాని ఇంగ్లీషు మాట్లాడుతారు. సభలలో చర్చ జరిగే సమయంలో కొంతమంది సభ్యులు 'యాస్' అనేవారు. నేను ఒక చిన్న గాడిదని అని వ్యక్తం చేసుకుంటూ. ఆ వ్యక్తికి అంతకంటే ఆంగ్లంలో తెలిసిన పదంలేదు. అదే సభలో మరియొక మూలనుంచి ఇంకొక సభ్యుడు యాస్ అంటాడు. అంటే నేను ఇంకొక పెద్ద గాడిదని అని. ఇంకొక మూలనుంచి అలాగే అంటారు ఇంకొకరు. అది నేనొక కంచరగాడిదని అని తెలియజేస్తుంది' అని అన్నారు శ్రీ బాబూజీ.

'ఇలా ఉంటాయి మన చదువులు. మన పండితులు కూడా అంతే. అనుభవ పూర్వకంగా మహాత్ములు చెప్పే బోధలకి వక్రభాష్యం అయినా చెప్తారు, లేకపోతే ఇదంతా తమకే బాగా తెలుసుననైనా భావిస్తారు. మరి వీరిని ఏమంటారు? విద్యామూర్ఖులు అంటారు' అని శ్రీ బాబూజీ ముగించారు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు అయిన శ్రీమతి కొప్పెర్ల పార్వతి (పూల పార్వతి) గారు 26-5-2026 మంగళవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 74 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

## ఆశను వదలితేనే ఆనందం

"మానవుడు సంసారం తనని బంధిస్తోందని అనుకుంటాడు. తన ఆశే తనని బంధిస్తోంది గాని, సంసారం ఎన్నటికీ తనని బంధించదు. దీనికి శ్రీబాబూజీ మహరాజ్ ఒక చక్కటి కథని ఉదహరించేవారు.



'కోతులు పట్టేవాడొకడు, ఒక సన్నమూతి, పెద్ద పొట్ట గల కూజా నిండా పప్పు బెల్లాలు వేసి, దారమ్మట కూడా పప్పులు జల్లి, కోతి కోసం పొదలో కూర్చున్నాడు. ఇంతలో ఒక కోతి రానే వచ్చి, త్రోవమ్మట వున్న పప్పు బెల్లాలని తింటూ, కూజా దగ్గరకి వచ్చి, గంపెడాశతో తన చేతిని ఆ కూజాలోకి దూర్చి, గుప్పిట నిండా పప్పులని పట్టుకుంది. అక్కడే పొంచి వున్న వేటగాడు దాన్ని పట్టుకునేందుకు రావడం చూసి, ఆ కోతి తన గుప్పిట నిండా వున్న పప్పులతో సహా పారిపోదామని తలచి, సన్నగా పొడవుగా వున్న కూజా మూతి నుండి దాని నిండు గుప్పిటని బయటకు తీయడానికి ఎంత ప్రయత్నించినా, అది బయటకి రాకపోయేసరికి, ఆ కూజా లోపల ఏదో భూతం తనని పట్టుకుందని తలంచి భీతిల్లసాగింది! గుప్పిడి విప్పి పప్పులని వదిలేస్తే తన చేయి బయటకి వచ్చేదే కదా!

ఆశా మోహాలకి కట్టుబడిపోయి, తాను సంసారాన్ని గట్టిగా పట్టుకుని, పైగా సంసారం తనని బంధిస్తోందని వాపోతాడు మానవుడు! చూశారా! మానవుల భయాలు కూడా యిలాగే వుంటాయి. 'ఆశ' అనే గుప్పిటిని వదిలేస్తే తనకి ముక్తి లభించి ఆనందాన్ని పొందగలడు. ఇలాగని సంసారాలని వదిలేసి అడవులకో, ఆశ్రమాలకో వెళ్ళిపోవాలా అని మీరడగవచ్చు. అలాగని ఏ మహాత్ముడూ చెప్పలేదు. సంసారంలోనే వుంటూ, తామరాకు మీద నీటిబొట్టులాగా, ఎంతవరకు వుండాలో అంతవరకే వుండాలి. మీరు సంసారంలో వుండవచ్చు, కానీ మీలోనికి సంసారం రాకూడదు. పడవ నీటిలో వుండవచ్చు, కానీ పడవలోకే నీళ్ళు వస్తే, అది మునిగిపోతుంది. పరమకారుణ్య రూపిణియైన జగన్మాత, అటువంటి అఖండ, భక్తి, జ్ఞాన వైరాగ్యములను, అఖండ సుఖశాంతులను ప్రసాదించి మిమ్ము సర్వదా కాపాడుగాక".

# అర్థమనర్థం

(గత సంచిక తరువాయి)

- పాలూరి కాళీప్రసాద్

**ఇదమద్య మయా లబ్ధం ఇమం ప్రాప్స్యే మనోరథమ్। ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్॥** నేడు నాకు ఇంతటి సంపద లభించింది, నా కోరికలన్నీ ఈరోజే తీర్చుకుంటాను. నా దగ్గర ఈ ధనముంది, అలాగే, భవిష్యత్తులో ఇంకా చాలా ధనం నాకే వస్తుంది అనే ఆలోచనలన్నీ అసుర స్వభావం వలన కలిగేవే అని భగవద్గీతలో 16వ అధ్యాయంలో శ్రీకృష్ణ పరమాత్మ చెబుతున్నారు. అంతే కాదు ఇలాంటివారు 'ఈ శత్రువు నా చేతిలో చచ్చాడు, మిగిలిన వారిని కూడా చంపుతాను, నేను ప్రభువును, భోగిని, సిద్ధుడిని, బలవంతుణ్ణి, సుఖవంతుణ్ణి, నేను గొప్పవాడిని, నా కులం గొప్పది, నా వెనుక ఇంత బలగం ఉంది, నాకు సముడెవ్వడు? యజ్ఞం చేస్తాను, దానం ఇస్తాను, ఆనందిస్తాను' ఇలాంటి భావనలతో అవివేకంలో, మోహంలో పడి చివరికి నరకం పాలవుతున్నారు అని కూడా చెప్పారు.

మరి మన ధనాన్ని ఎలా చూడాలి? ఎలా అనుభవించాలి? అని ప్రశ్న వస్తుంది. దీనికి శ్రీ బాబూజీ మహరాజ్ వారు 'ఒక బ్యాంకు ఉద్యోగి చేతులమీదుగా రోజూ అనేక లక్షల రూపాయల వ్యవహారం జరుగుతూ ఉంటుంది. కానీ అతనికి ఆ రూపాయలపై ఎటువంటి మమకారం ఉండదు. ఒకవేళ అలాంటి మమకారం ఏర్పడిన మరుక్షణం అతను జైలు పాలవుతాడు. అలాగే భక్తుడు తన సంసారం పట్ల శ్రద్ధ, ప్రేమ, బాధ్యతలతో వ్యవహరించాలి కానీ మమకారం పెంచుకోకూడదు. అది బంధనానికి దారి తీస్తుంది' అని, 'నీ ధనానికి నిన్ను నువ్వు ఒక ధర్మకర్తగా భావించుకో కానీ ఒక యజమానిగా కాదు' అని బోధించారు.

ధనానికి మూడు గతులు ఉంటాయని భర్తృహరి **దానం భోగో నాశస్తిస్రో గతయో భవంతి విత్తస్య। యో న దదాతి న భుంక్తే తస్య తృతీయా గతిర్భవతి॥** దానము, భోగము, నాశము అని ధనానికి మూడు గతులు ఉంటాయి. ఎవరైతే దానమివ్వకుండా, తాము అనుభవించకుండా దాచిపెట్టుకుంటారో అట్టి ధనానికి మూడవదైన నాశం కలుగుతుంది అని చెప్పాడు. ఇందులో ఉత్తమ గతి మనకు వున్నంతలో ఎదుటివారికి దానం చేయడం. అది కూడా గొప్పలకోసం, పుణ్యంకోసం, ప్రతిఫలం కోసం కాకుండా దేశ కాల పాత్రతలను ఎఱిగి దానం చేయాలని భగవద్గీత బోధిస్తోంది. ఇక తనకు వున్నదానిని కనీసం తానైనా అనుభవించడం మధ్యమ గతి. ఈ రెండు చేయనివారి ధనం దొంగలపాలో, రాజులపాలో, అగ్నిపాలో అయిపోతుందని శాస్త్రం చెబుతోంది.

మన సంస్కృతి విత్తం కంటే విద్యకే ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చింది. **విద్య నిగూఢ గుప్తమగు విత్తము రూపము పూరుషాళికిన్ విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశబంధుడున్ విద్య విశిష్ట దైవతము విద్యకు సాటి ధనంబు లే దిలన్ విద్య నృపాల పూజితము విద్య నెరుంగనివాడు మర్త్యుడే** అన్నాడు భర్తృహరి. డబ్బులున్నవాడు తన ఊరిలోనే గౌరవించబడతాడు. అది కూడా తన అవసరం ఉన్న కొందరిచేతనే! ఎప్పుడైతే వాడితో అవసరం తీరిపోతుందో, లేదా వీడు పిసినారివాడు, ఎలాగూ మనకు సహాయం చేయడు అనుకుంటారో అప్పుడే వాడిని గౌరవించడం మానేస్తారు. కానీ విద్య ఉన్నవాడు ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా గౌరవింపబడతాడు. ఇప్పుడు మనం చూస్తూనే ఉన్నాం – మన రూపాయలు వేరే దేశానికి తీసుకెళ్తే ఎందుకూ పనికిరావు. అక్కడి ధనం రూపంలోకి మార్చుకున్నా వాటి విలువ చాలా తగ్గిపోతుంది. అయితే సరైన విద్య ఎక్కడైనా ఒకేరకంగా పనికివస్తుంది.

మరి నిజమైన ధనం ఏమిటి? దేనిని సంపాదిస్తే అది మనదగ్గర శాశ్వతంగా ఉంటుంది? అని ఆలోచిస్తే శ్రీగురుదేవులు 'నామస్మరణ ధనమే నీ ధనము' అని అందించారు. '**నామ్ ధన్ కా ఖజానా బఢాతే చలో**' అని కూడా అందించారు. 'భగవత్స్మరణలో, సత్సంగంలో గడిపిన కాలమంతా నీ నిత్యకాలంలో జమ అవుతుంది' అని కూడా బోధించారు. కలియుగంలో మనం సంపాదించుకోవలసిన, జమ చేసుకోవలసిన ధనం నామస్మరణ ధనం ఒక్కటే. ఈ కలియుగంలో సంసార బంధనాల నుంచి ముక్తిని పొందడానికి అంతకంటే వేరొక ఉపాయం ఏదీ లేదని కలిసంతరణ ఉపనిషత్తు బోధిస్తోంది. **నామస్మరణాదన్యోపాయం నహి పశ్యామో భవతరణే।**

***సముద్రంలోని పెద్ద పెద్ద అలలను తట్టుకొని, భద్రంగా ఒడ్డుకు చేరడంలో దిక్సూచి నౌకకు సాయపడుతుంది. అలాగే సంసారమనే సాగరాన్ని తేలికగా తరించి, అవతలి ఒడ్డుకు చేరుకోవాలంటే, దిక్సూచి ఎప్పుడూ ఉత్తర దిక్కునే సూచిస్తున్నట్లుగా మన మనస్సు ఎప్పుడూ భగవంతుని మీదే నిలచి వుండాలి.***

- శ్రీ కాళీబాబు

# మంత్ర మహిమ

- సన్నిధానం కాళీమాత

మహర్షుల వలె జితేంద్రియులై నిరంతరం తపస్సులో వుండటం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. కాని తపోవృత్తిలో వున్నా, అదే వృత్తిలో వుండేవారిని అనుసరించినా అది తపస్సే అవుతుంది. వేదాధ్యయనం చేయటమే కాక, ఎవరైనా అధ్యయనం చేస్తున్నప్పుడు నిరంతరం వింటూవుంటే కూడా ఫలితం కలుగుతుంది. వాటిలో వుండే శక్తి అటువంటిది.

ఒకనాడు ఒకముని స్నానం చేద్దామని తన ఆశ్రమం నుండి దేవికా నదికి వెడుతుంటే, దారిలో ఒక నిషాదుడు 'నిలువరా! బాపడా!' అన్నాడు. క్రూర స్వభావం కలిగిన ఆ నిషాదుడు పశుపక్ష్యాదులను చంపి పొట్టపోసుకోవడం, ధనం కోసం దయాదాక్షిణ్యాలు లేక మనుష్యుల ప్రాణాలు తీయడం వృత్తిగా కలవాడు. అయితే అతను నిలువరించిన ముని సామాన్యుడు కాడు. బ్రహ్మామానస పుత్రుడుగా విదితుడై, జితేంద్రియుడు, పరమ సాత్వికుడు అయిన అరుణ మహర్షి. ఆయన స్వభావం సాత్వికమే కాని, తపస్సు తీక్షణమైనది. తపస్సులో మాత్రం తీవ్ర స్వభావం కలిగినవాడు.

తనను నిలువరించిన నిషాదుడిని నిర్భయంగా, నిలువునా ఒకసారి పరికించి చూశాడు. అంతే! అగ్నిహోత్రం మీద నీళ్ళు పోసినట్లు ఆ నిషాదుడి క్రూర లక్షణాలు ఆ చూపుతో చల్లారిపోయాయి. ఆయన అతడిని చూశాడే కానీ, ఏమీ అనలేదు. కాని నిషాదుడిలో పెద్ద మార్పు వచ్చింది. అతడికి విచిత్రమైన అనుభూతి కలిగింది. వణుకు, కంపన పుట్టాయి. అతడు ఆ మహర్షి పాదాలపై పడి, తన క్రూర స్వభావాన్ని వివరించి, తనను అనుగ్రహించి, రక్షించి, మార్గోపదేశం చేయమని ప్రార్థించాడు. ఆయన ఏమీ సమాధానం చెప్పకుండా, చిరునవ్వుతో వెళ్ళిపోయాడు. నిషాదుడు ఆయనను అనుసరించాడు. ఆ ముని ఏమీ కోరకుండానే ఆయనకు నిషాదుడు అన్ని సపర్యలూ చేసేవాడు. అరుణ మహర్షి అతని సేవలను అంగీకరిస్తూనే, ఉదాసీనంగా వుండేవాడు. కొన్ని సంవత్సరాలు గడిచాయి. నిషాదుడు ఆ ముని పాదాలను విడిచిపెట్టలేదు. ఉంటే తినేవాడు, లేకపోతే అలానే నిరాహారియై, తపోవృత్తిలో వున్న, ఆ మహర్షిని అనుసరించి తగిన సేవలు చేసేవాడు.

ఒకనాడు ఆ మహర్షి నదీ స్నానం చేసి, ఒడ్డున బట్టలు పిండుకుంటూ వుండగా, ప్రక్కనే వున్న పొదల్లో నుంచి పెద్ద పులి గాండ్రుమంటూ ఆయనను చంపటానికి వచ్చింది. నిషాదుడు వెంటనే ఒక పదునైన బాణంతో దాన్ని చంపివేశాడు. ఒక విషపు బాణం దాన్ని చీల్చినట్లుగా వెయ్యడం వలన అది గిలగిలా తన్నుకుంటూ పెద్దగా

గాండ్రిస్తూ మరణించింది. అంతటి క్రూర కర్మ తాను ఎప్పుడూ చూడకపోవడం వలన అరుణ మహర్షి 'నారాయణ! నారాయణ! నారాయణ!' అంటూ పెద్దగా ఉచ్ఛరించాడు. ఆ మంత్రం వినిపించగానే ఆ పులికి మరణ బాధ నుంచి ఉపశమనం కలిగి అందులో నుంచి దివ్యతేజస్సుతో ఒక దివ్య ఆకృతి నిలిచి, మహాత్మా! మీ నారాయణ మంత్ర అమృత వాక్కులతో నాకు శాపం తొలగింది. నేను వైకుంఠానికి చేరతాను' అని పలికింది.

అరుణ మహర్షి 'నీవెవరవు' అని అడుగగా 'మహాత్మా! నేను పూర్వ జన్మలో ఒక క్షత్రియ వీరుణ్ణి. సాత్వికులు, తపోధనులైన వారిని పరాభవించేవాడిని. జీవితమంతా క్రూర కర్మలతో, యుద్ధాలు చేస్తూ, మనుష్యులను చంపడం తప్ప, సత్వగుణమనేదే లేకపోవటం వలన నన్ను శార్దూలమై పుట్టమని శపించడం జరిగింది. తప్పు తెలుసుకుని, శాప విమోచనకై ప్రార్థించగా, 'నీవు ఒక మునిని సంహరించడానికి వెళ్ళినప్పుడు, ఒక భిల్లుని చేతిలో మృత్యువు సంభవిస్తుంది. ఆ ముని నీకు అష్టాక్షరీ మంత్రం ఉపదేశిస్తాడు. తీక్షణమైన తపోమహిమ కలిగిన ఆ ముని వాక్కు నుంచి నీకు లభించిన శక్తివంతమైన మంత్రం వల్ల నీకు శాప విమోచనం జరుగుతుందని తాపసులు అనుగ్రహించారు' అని నమస్కరించి వెళ్ళిపోయాడు.

అరుణ మహర్షి వెంట వున్న ఆ భిల్లుడికి కూడా అదే ఉపదేశం అయింది. అతడు కూడా మహర్షికి నమస్కరించి తపస్సుకు వెళ్ళిపోయాడు.

### *పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు*

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**జులై 2026**

**9 గురు: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ**

**25 శని: తొలి ఏకాదశి – శ్రీ సద్గురు పాదపూజ**

**29 బుధ: ఆషాఢ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ**

**ఆగస్ట్ 2026**

**8 శుక్ర: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ**

**28 శుక్ర: శ్రావణ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ**

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

**17. అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతం**
**వినాశ మవ్యయస్యాస్య న కశ్చిత్కర్తు మర్హతి ॥**

శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! ఒక వస్తువు పగిలిపోవచ్చు. కాని ఆ వస్తువు ఏ పదార్థముతో చేయబడినదో దానికి పగిలిపోవటం అనేది వుండదు. అదే విధంగా సృష్టి అంతా నాశనం కావచ్చు. కాని ఈ జగత్తుగా భాసిస్తూ దానికి ఆధారంగా, మూలంగా ఏ బ్రహ్మ పదార్థామైతే ఉన్నదో, ఆ బ్రహ్మము మాత్రం నాశనము లేనిది" అన్నాడు.



ఆత్మకు వ్యయం లేదు. దానిని ఎవ్వరూ నాశనం చేయలేరు. కుండను పగలగొట్టవచ్చును గాని, మట్టిని నాశనం చేయలేము కదా! అందుచేత నీవు తొలగించ వలసినది జగత్తును కాదు, నీ అజ్ఞానాన్ని. నీ అజ్ఞానాన్ని లేదా అవిద్యను తొలగించే విద్యయే బ్రహ్మ విద్య అనబడుతున్నది. దీనిని పొందే మార్గమే యోగ శాస్త్రము. అందువలననే గీత బ్రహ్మ విద్య, యోగశాస్త్రము అని పిలువబడుతున్నది.

ఆత్మ అవినాశి. దానికి నాశనం లేదు. జగద్భ్రాంతికి మూలమైన అవిద్యను పోగొట్టుకోవటమే సర్వ సమర్పణం చేయుటం అంటే. ఆత్మజ్ఞానాన్ని పొందితే అంతా పొందినట్లే. ఆత్మజ్ఞానికి పొందవలసినది ఇక వేరే ఏమీ ఉండదు. అందువలననే క్రీస్తు ప్రభువు "ఎవరు నా కొరకు సర్వస్వమునూ అర్పించుకొంటాడో, అతడు నా నుండి అన్నింటిని పొందగలడు" అన్నాడు. వాస్తవానికి అనన్యము, అద్వితీయము, సర్వాతీతం, సర్వాంతర్యామి అయిన సచ్చిదానంద పరబ్రహ్మములో ఈ జగత్తుకు సంబంధించినది ఏదీ లేదు. జ్ఞానులు ఈ జగత్తును బ్రహ్మ వివర్తంగా దర్శిస్తే, భక్తులు, ఈ జగత్తును భగవంతుని లీలగా భావన చేసి నిరతిశయమైన ఆనందాన్ని పొందుతున్నారు.

18. అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తా శరీరిణః
అనాశినో౽ ప్రమేయస్య తస్మాద్యుద్ధ్య స్వ భారత! ॥

శ్రీ కృష్ణ భగవానుడు "అర్జునా! కుండ పగిలినట్లు ఈ దేహాలు నాశనం అవుతాయి. కాని కుండ దేనితో చేయబడిందో, ఆ మట్టికి నాశనము లేదు. ఇది అనివార్యం. దీనిని ఎవ్వరూ మార్చలేరు. అందువలన దేహానికి మరణము అనివార్యము, అలాగే ఆత్మకు నాశనం లేదు అన్న సంగతి గుర్తించి, నీ కర్తవ్యాన్ని నేను కర్తను అన్న భావం లేకుండా నిర్వర్తించు" అన్నాడు.

జగత్తు అంతా పురుషోత్తముడి లీల అన్నది సత్యమే అని నీవు విశ్వసించినట్లయితే, జగత్తును గురించిన నీ అభిప్రాయాలలో, నీ ప్రతిస్పందనలో, అంటే నీ ఆలోచనలో, ఊహలో మార్పు రావాలి. అలలు కూడా ఎలా సముద్రమో జగత్తు కూడా అలాగే బ్రహ్మము. ఆ బ్రహ్మమే జగత్తుగా భాసిస్తున్నది. ఒకసారి మేరీ హేల్ స్వామి వివేకానందుడికి జాబు వ్రాస్తూ, "స్వామీజీ! మీ బోధల సారాంశం అంతా భగవంతుడు అనే కదా?" అని వ్రాసింది. దానికి స్వామీజీ "నేను భగవంతుడే ఈ జగత్తు అంతటిగా భాసిస్తున్నాడు" అన్నాను గాని, "అంతా భగవంతుడే" అనలేదు అని బదులు వ్రాశారు. అంతేకాదు, స్వామీజీ తన అనుయాయులకు "నీవు అందరిలో భగవంతుణ్ణి చూడటం కాదు. అంతకన్న ముందుగా నీ చుట్టూ ఉన్న వీరందరిలో, వీరందరిలాగా కనిపిస్తున్న భగవంతుడిని దర్శించు" అని బోధించారు. అలా కాకపోయినట్లైతే ఇదంతా శుష్క వేదాంతం, లేదా మెట్టవేదాంతం క్రిందకు మారుతుంది.

స్వామి వివేకానంద "శివభావే జీవసేవ" అన్నారు కదా, అంటే జీవులంతా శివుడే కదా అని నీకు అనిపించవచ్చు. అయితే ఈ శివభావే జీవసేవ అనేది శ్రీరామకృష్ణ పరమహంస నిర్వికల్ప సమాధి నుండి స్పృహలోకి వస్తూ ఇంకా ఆ దివ్యానుభూతిని అనుభవిస్తూ, ఒక అభౌమమైన దివ్యావేశంలో ఉన్నప్పుడు అన్న మాటలు. ఆ వెంటనే ఆయన "సాటి మానవుడిపై దయ, కరుణ, జాలి చూపటానికి నీవెవడివి? దయ, ప్రేమ అనేవి చూపటం ఒక్క భగవంతుడికే సాధ్యం. భగవంతుడు తోటి జీవిగా భాసిస్తూ, నీ తోటి జీవికి నీవు సేవ చేయుటం ద్వారా తనను

సేవించే అవకాశం నీకు ప్రసాదించినందుకు, నీవు ఆ భగవంతుడికి కృతజ్ఞుడివిగా ఉండు. అందుచేతనే తోటి జీవిని శివునిగా భావించి, ఆ శివుడినే సేవిస్తున్నాను అన్న భావంతో, ఆ శివుణ్ణి ఎలా సేవిస్తావో, అలా నీతోటి జీవిని సేవిస్తే నీవు నిజంగా ఆ శివుడికి సేవ చేసినవాడవు అవుతావు" అన్నారు. కాని జీవుణ్ణి శివుడుగా భావించటం అనేది అంత తేలికైన విషయం కాదు. దీనికి ఎంతో సాధన కావాలి. కర్తృత్వ - భోక్తృత్వాభిమానం లేకుండా, స్వధర్మాన్ని ఆచరిస్తూ పోతే, నీ హృదయం నిర్మలము, నిస్తరంగంగా అయి, కర్మయోగము, జ్ఞాననిష్ఠ యోగ్యత, జ్ఞానయోగము, జ్ఞానము, భక్తియోగము క్రమంగా సిద్ధించి నీకు జీవుని యందు శివభావం కలుగుతుంది. శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికి దీనిని ఉపదేశించి "అర్జునా! అల్లకల్లోలంగా ఉన్న నీ హృదయం నిర్మలంగా నిస్తరంగంగా కావాలి. దానికి స్వధర్మాచరణం ఒక్కటే మార్గం. అందువలన నీ స్వధర్మమైన యుద్ధం చెయ్యి" అని అన్నాడు.

- సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**జులై 2026**

**9 గురు: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**25 శని: తొలి ఏకాదశి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**29 బుధ: ఆషాఢ పూర్ణిమ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**ఆగస్ట్ 2026**

**8 శని : శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**28 శుక్ర: శ్రావణ పూర్ణిమ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

## శ్రీ మాతాజీవారి అమెరికా పర్యటన వివరములు

శ్రీమాతాజీవారు జూన్ 1, 2026 నుండి జులై 6, 2026 వరకు అమెరికాలోని వివిధ ప్రదేశములు పర్యటిస్తారు. ప్రతి సంవత్సరము అమెరికాలో జరుపబడే వార్షిక త్రయాహ్నిక దీక్ష , సత్సంగము జులై 2 నుండి 5 వరకు ఫోర్ట్‌మిల్ సౌత్ కేరొలినాలో జరుగును. వివరములకు క్రింద ఇవ్వబడిన **QR code** ను స్కాన్ చేసుకొనవలెను. అమెరికా పర్యటన వివరములకు సంప్రదించవలసిన వారి పేరు,ఫోన్ నంబరు:

అమెరికా : శ్రీ తనకెళ్ల కాళీప్రసాదు :

**+1 (317) 459-2335,**

**ఇండియా : శ్రీ మురళీ మోహన వర్మ :**

**093983 34345,**

**09393834345.**

https://mathaji-babuji.org/2026%20US...

## శ్రీ మాతాజీవారి యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటన వివరములు

శ్రీమాతాజీవారు జులై 7, 2026 నుండి జులై 21, 2026 వరకు యునైటెడ్ కింగ్‌డమ్ లోని వివిధ ప్రదేశములు పర్యటిస్తారు. ప్రతి సంవత్సరము యు.కె.లో జరుపబడే వార్షిక త్రయాహ్నిక దీక్ష, సత్సంగము జులై 10 నుండి 12 వరకు రీడింగ్‌లో జరుగును. వివరములకు క్రింద ఇవ్వబడిన **QR code** ను స్కాన్ చేసుకొనవలెను. పర్యటన వివరములకు సంప్రదించవలసిన వారి పేరు, ఫోన్ నంబరు:

యునైటెడ్ కింగ్‌డమ్ : శ్రీ తేజ గారు

0044-7805022588

**ఇండియా : శ్రీ మురళీ మోహన వర్మ :**

**093983 34345**

**09393834345**

https://mathaji-babuji.org/2026_SriMataj...

## విద్యాపతి

సేకరణ - మురళి

విద్యాపతి ఠాకూర్ 1350 వ సం. బీహారు మధుబని జిల్లా విస్ఫీ గ్రామంలో జన్మించారు. తండ్రి శ్రీ గణపతి ఠాకూర్, తల్లి హంసిని దేవి, కపిలేశ్వర మహాదేవుని ఆరాధించి ఇలాంటి కుమార రత్నాన్ని పొందారని చెబుతారు. మైథిలి భాషీయులైన కవులు కూడా ఇతర భాషల్లో కవిత్వం చెప్పే రోజుల్లో ఆయన మైథిలి భాషలోనే అసంఖ్యాక భక్తి పదాలు, అనేక గ్రంథాలు రచన చేసి మైథిలి సాహిత్య వైతాళికునిగా నిలిచారు. విద్యాపతి పూర్వీకులు మైథిలి ప్రాంతంలో సుప్రసిద్ధులైన రాజనీతివేత్తలు, పవిత్ర గ్రంథకర్తలు.

విద్యాపతికి 6 తరాల ముందువారు మైథిలి రాజ్యానికి మహామంత్రులుగా పనిచేశారు. విద్యాపతి పూర్వీకులు మరొకప్రక్క మైథిలి ప్రాంతంలో సుప్రసిద్ధి పొందిన పలు స్మృతి గ్రంథాలను, ధర్మసూత్ర గ్రంథాలను రచించారు. బాల్యదశ నుంచే విద్యాపతి అత్యంత తెలివైనవాడు, సహజకవి స్వభావం కలవాడు. విద్యాపతి వంటి శివభక్తుడు చరిత్రలో ఎప్పుడూ పుట్టలేదు, భవిష్యత్తులో కూడా పుట్టడని వారు విశ్వసిస్తారు. ఆయనకు ఉన్న అపార భక్తి చూసి స్వయంగా భగవాన్ శంకరుడు కరిగిపోయాడు. అటువంటి ఆశ్చర్యకరమైన భక్తుడు, కవి అయిన విద్యాపతి లేకుండా తాను ఉండలేనని ఆయనకు అనిపించింది.

ఒక రోజు భోళాశంకరుడు తన రూపాన్ని మార్చుకొని, ఒక అజ్ఞాన గ్రామీణ యువకుడి వేషంలో మహాకవి ఎదుట ప్రత్యక్షమయ్యాడు. ఆ గ్రామీణుణ్ణి చూసిన మహాకవి “నీవెవరు, నీ పేరు ఏమిటి? నా దగ్గరకు ఎందుకు వచ్చావు?” అని అడిగాడు. అతడు వినమ్రంగా “నా పేరు ఉగ్నా. నేను దూర గ్రామానికి చెందిన పేద, నిరుద్యోగి, చదువులేని యువకుడిని. పనికోసం మీ వద్దకు వచ్చాను” అని జవాబిచ్చాడు. దీనికి మహాకవి “నేను సాధారణ కవిని మాత్రమే. నీకు సరిపోయే పని నా వద్ద లేదు।” అన్నాడు. “ఓ కవీశ్వరా, నన్ను మీ దగ్గర సేవకుడిగా వుంచుకోలేరా?” అని అడిగాడు ఉగ్నా. విద్యాపతి “నాకు సేవకుడి అవసరం లేదు. అంతేకాదు, సేవకుడిని పోషించేంత ఆర్థిక స్థోమత కూడా లేదు. కాబట్టి నువ్వు వేరే ఎక్కడైనా పని చూసుకో” అన్నాడు. కానీ ఉగ్నా వెళ్ళడానికి సిద్ధపడలేదు. మహాకవి మాట ముగిసిన వెంటనే ధైర్యంగా, “ఠాకుర్‌జీ! నాకు మీ దగ్గర నుంచి ఏమీ అవసరం లేదు. రోజుకు రెండు పూటల పొట్ట నింపే భోజనం ఇస్తే చాలు।” అన్నాడు ఉగ్నా. విద్యాపతి మౌనంగా వున్నాడు. ఇంట్లో వున్న ఆయన భార్య సుశీల ఈ సంభాషణను విని బయటకు వచ్చి “బీదవాడు, అనాథ అంటున్నాడు. ఇంత పెద్ద ఇంట్లో పనుల కోసం ఒక నమ్మకమైన మనిషి అవసరం

కూడా ఉంది. మీరు బయటకు వెళ్ళినప్పుడు నేను ఎప్పుడూ మీ గురించి ఆందోళన చెందుతుంటాను. ఇతను అమాయకుడు, నిజాయితీ గలవాడిగా కనిపిస్తున్నాడు. మన కుటుంబ సభ్యుడిలానే ఉంటాడు, కాదనకండి" అన్నది. భార్య మాటలు విని విద్యాపతి ఆలోచనలో పడిపోయాడు. కొంతసేపటికి "సరే ఉగ్నా! ఇంటి వద్ద అమ్మగారికి సహాయంగా ఉండు. సేవకుడిలా భావించుకోక నమ్మకంగా ఉండు" అన్నాడు.

అప్పటి నుండి ఉగ్నా మహాకవి ఇంట్లో వినయవంతుడైన, విశ్వాసపాత్రుడైన సేవకుడిగా మెలగసాగాడు. అతడు చేసే పనిలో ఎవరూ తప్పు పట్టలేని విధంగా శ్రద్ధ పెట్టేవాడు. విద్యాపతి, సుశీలా ఇద్దరూ అతని నిజాయితీ, సేవాభావం చూసి చాలా సంతోషించారు. విద్యాపతికి ఉగ్నాపై బాగా విశ్వాసం ఏర్పడింది, ఎక్కడికైనా వెళ్తే అతడిని వెంట తీసుకెళ్ళేవాడు. ఒక రోజు మహాకవి తన గ్రామమైన విస్ఫీ నుండి రాజదర్బార్‌కు నడుచుకుంటూ వెళ్తున్నారు. వెంట ఉగ్నా కూడా ఉన్నాడు. జ్యేష్ఠ మాసం. మండుతున్న ఎండ. చుట్టూ ఎండిపోయిన పొలాలే తప్ప చెట్టు లేదు, నీటి చుక్క లేదు. అలాంటి సమయంలో విద్యాపతికి తీవ్రమైన దాహం వేసింది. ఆయన "ఉగ్నా, చాలా దాహంగా ఉంది. ఈ లోటా తీసుకుని ఎక్కడినుంచైనా నీళ్ళు తీసుకురా।" అన్నాడు "ఠాకుర్‌జీ! ఇక్కడ ఎక్కడా నీటి జాడ కనిపించడం లేదు. ఇంకొంచెం ముందుకు వెళ్ళితే ఏదైనా ఊరు వస్తుందేమో" అన్నాడు ఉగ్నా. కానీ దాహంతో అలమటిస్తున్న విద్యాపతి "ఎలాగైనా నీళ్ళు తెచ్చి పెట్టు. లేదంటే దాహంతో చనిపోతాను" అని చెప్పి అక్కడే స్పృహ తప్పి పడిపోయాడు.

ఉగ్నా సాధారణ సేవకుడు కాదు. అతడే స్వయంగా దేవాదిదేవుడు మహాదేవుడు. కొద్దిదూరం చెట్టుచాటుకు వెళ్ళి తన జటాజూటం నుండి గంగాజలాన్ని ఒక లోటాలో తీసుకొచ్చాడు. విద్యాపతిని లేపుతూ "ఠాకుర్‌జీ! లేవండి. మీ కోసం నేను కష్టపడి నీళ్ళు తెచ్చాను. దాహం తీర్చుకోండి।" అన్నాడు. ఆ మాటలు విన్న విద్యాపతి ఒక్కసారిగా లేచి ఆ నీటిని గటగటా తాగేశాడు. నీరు తాగగానే అది సాధారణ నీరు కాదని, పవిత్ర గంగాజలం అని ఆయనకు అనిపించింది. ఆయన ఆశ్చర్యంతో "ఉగ్నా! నిజం చెప్పు. ఈ నీళ్ళు ఎక్కడి నుండి తెచ్చావు? ఇది సాధారణ నీరు కాదు, గంగాజలం!" అన్నాడు. ఉగ్నా మాట తప్పించేందుకు "ఠాకుర్‌జీ! దగ్గర్లోని బావి నుండి తెచ్చాను. మీరు అనవసరంగా గంగాజలం అంటున్నారు" అన్నాడు. కానీ విద్యాపతి సాధారణ వ్యక్తి కాదుకదా, "ఉగ్నా! నువ్వు సాధారణ సేవకుడు కాదని నాకు స్పష్టంగా తెలుసు. నిజం చెప్పు. లేకపోతే నేను ఇక్కడి నుండి కదలను।" అన్నాడు ధృఢముగా.

- సశేషం

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహారాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి) -పాలూరి ప్రసాద్

**150. ఓం చిదానందకరాయ నమః**

మనము ఈ ప్రపంచములో అనుభవించే ఆనందాలన్నీ అశాశ్వతమైనవి. మన అజ్ఞానము వలన దుఃఖముతో కూడుకొనియున్న ఈ ఆనందములనే శాశ్వతములని తలచి వాటి కోసం ప్రాకులాడుతున్నాము. కానీ జ్ఞానము వలన కలిగే ఆత్మానందమే సత్యమైనది, నిత్యమైనది. చిత్ అనగా జ్ఞానము వలన కలిగే అట్టి ఆనందమును మనకు ప్రసాదించగలిగేది ఒక్క సమర్థ సద్గురు దేవులు మాత్రమే.

**151. ఓం తేజస్కరాయ నమః**

శ్రీగురుదేవులు తమను ఆశ్రయించిన శిష్యుల హృదయ కుహరాలలోని అజ్ఞానమనే చీకటిని తొలగించి, తమ తత్త్వ బోధ చేత ఆ హృదయాలలో జ్ఞాన తేజస్సును ప్రసరింపచేసి తద్వారా జగత్తుకంతటికీ దివ్య కాంతిని ప్రసాదించే జ్ఞాన సూర్యులు.

**152. ఓం దీన దయా పరాయ నమః**

శ్రీ గురుదేవులు దీనులైన జీవులపై ఎల్లప్పుడు తమ దయా వర్షాన్ని కురిపించి వారిని ఉద్ధరిస్తారు. కేవలం మనుష్యులే కాక సర్వజీవుల యందు వారు దయాగుణం కలిగి ఉండటాన్ని మనం ఎన్నో సార్లు ప్రత్యక్షంగా చూసి ఉన్నాము.

**153. ఓం బ్రహ్మ విద్యా నిధయే నమః**

శ్రీ గురుదేవులు బ్రహ్మ విద్యకు నిధియైన వారు. ఏ విద్యను తెలుసుకొంటే ఇక ప్రపంచములోని ఏ ఇతర విద్యలతో పని లేదో, అట్టి మోక్షదాయకమైన విద్యయే బ్రహ్మ విద్య. శ్రీగురుదేవులు అట్టి బ్రహ్మవిద్యను తమను ఆశ్రయించిన శిష్యకోటికి ఉపదేశించి వారిచే ఆచరింప చేసి వారిని తరింప చేయుటలో సమర్థులు.

**154. ఓం పూర్ణాయ నమః**

శ్రీగురుదేవులు పూర్ణ పురుషులు. ఏ పరబ్రహ్మ వస్తువు నుండి అయితే ఈ జగత్తు ఉద్భవించినదో, ఎవ్వరి దయ చేత వృద్ధి పొందుచున్నదో, తిరిగి ఏ విరాట్పురుషునిలో లీనమైపోవుచున్నదో అట్టి పూర్ణ పురుషులే శ్రీగురుదేవులు. అట్టి పూర్ణ తత్త్వమునుండి కొంత తీసివేయుటకు గాని, కొంత కలుపుటకు గాని ఏదీ లేదు. పౌర్ణమి నాటి పూర్ణ చంద్రునిలా ప్రకాశించే అట్టి శ్రీగురుదేవులకు నమస్కరించుచున్నాను.

**155. ఓం బ్రహ్మణ్యాయ నమః**

శ్రీగురుదేవులు సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపులు, సర్వవేదస్వరూపులు. "**బ్రహ్మణ్యో దేవకీ పుత్రో, బ్రహ్మణ్యో మధుసూదనః సర్వభూతస్థమేకం నారాయణం। కారణపురుష**

**మకారణం పరబ్రహ్మాం।**" అని నారాయణోపనిషత్తు చెబుతున్నది. నారాయణుడే గీతాచార్యుడు. గీతాచార్యుడే సమర్థసద్గురుదేవులు.

**156. ఓం వేద పారగాయ నమః**

శ్రీ గురుదేవులు వేదాలయొక్క చివరిభాగము లేక వేదాంతము, అంటే ఉపనిషత్తుల సారాంశము అనగా వేదముల వలన కీర్తింపబడే ఏ భగవత్తత్త్వం ఉన్నదో అట్టి భగవత్తత్త్వమే వారు కనుక వారి కన్న బాగుగా ఎరిగిన వారు ఎవరు ఉంటారు?

**157. ఓం సదానందాయ నమః**

శ్రీగురుదేవులు సదా ఆనంద స్వరూపులు. వారి వద్ద దుఃఖమునకు చోటు లేదు. వారు అనుభవించే అట్టి ఆనందము శాశ్వతమైనది, సత్యమైనది. కేవలం తన నిజ తత్త్వాన్ని తాను తెలుసుకొని తనలో తాను పొందే ఆనందము. వారు ఎల్లప్పుడూ అట్టి ఆనంద వారధిలో ఓలలాడుటయే కాక అందరినీ అదే ఆనందములో ముంచి తేలుస్తూ ఉంటారు. ఆ ఆనందములో మునిగి మరల తేలకుండా ఉండాలంటే శ్రీగురుదేవుల పట్ల సంపూర్ణ విశ్వాసముంచి వారి ఆజ్ఞను తు.చ. తప్పక పాటించుట ఒక్కటే మార్గము.

**158. ఓం స్వయం బ్రహ్మణే నమః**

సృష్టి అనే లీలా విలాసం కొరకై ఏ పరబ్రహ్మ శక్తి అయితే తనను తాను వ్యక్త పరచుకొని, త్రిమూర్తులను సృజియించి, సృష్టి, స్థితి, లయాలకు కారణభూతమై ఉన్నదో స్వయముగా అట్టి పరబ్రహ్మ స్వరూపులే శ్రీగురుదేవులు. బ్రహ్మ అనగా సృష్టించెడి వాడు. కాని శ్రీమద్భగవద్గీతలో గీతాచార్యులు చెప్పినట్లు శ్రీగురుదేవులు మనను ఉద్ధరించుటకై తమను తాము సృష్టించుకోవలసినదే గాని వారిని సృష్టించినవారు ఎవరూ లేరు. కనుక శ్రీగురుదేవులు వారికి వారే సృష్టి కర్త. అనగా స్వయంబ్రహ్మ.

**159. ఓం వదాన్యాయ నమః**

శ్రీ గురుదేవుల యొక్క సంపదకు, వారి దాన గుణమునకు పరిమితి లేదు. అడిగిన వారికి లేదనక వారు కల్పతరువు వలె వర్షిస్తూనే ఉంటారు. వారి వరద, అభయ హస్తములు ఎల్లప్పుడూ ఆశ్రితుల కొరకు తెరచియే ఉంటాయి. 'అడగందే అమ్మయినా పెట్టదు' అనే నానుడికి భిన్నంగా శ్రీగురుదేవులు ఇహంలో తమ ఆశ్రితుల ధర్మపరమైన కోర్కెలు తీర్చటమేకాక, వారి నిత్య జీవితంలో వారికి కూడ తెలియని, వారికి అవసరమైనవాటిని అడగకనే సమకూర్చి వారిని ఆదుకుంటారు. పరంలో తమ మధురామృత వాక్కులతో తమ ఆశ్రితులను భగవదున్ముఖులుగా చేసి వారు ఆధ్యాత్మిక పథంలో సునాయాసంగా ప్రయాణించటానికి అవసరమైన ఆత్మజ్ఞానాన్ని నిరంతరము ప్రవహించే తమ బోధామృత స్రవంతి ద్వారా వారికి అందజేస్తారు. అయితే ఏ కోరికలు లేక సంపూర్ణ శరణాగతి పొందిన వారికి వారు స్వంతమౌతారు.


- సశేషం

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

- కీ.శే. రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

ఇంతకాలము శ్రీకృష్ణుడు నన్ను మభ్యపెట్టలేదు కదా! కృష్ణుడు పైపైన ఒలకపోసిన ప్రేమను నిజమైన ప్రేమ అని భ్రమించి నేను మోసపోలేదు కదా! ఇన్నాళ్ళు ఆ భ్రమలో ఉన్నాను. కాని ఈ రోజు అసలు విషయం తేల్చుకోవలసిందే. ప్రేమ వ్యవహారంలో దాగుడు మూతలు పనికిరావు అనుకున్నాను. ఆరోజు కృష్ణుడు నా మందిరానికి వచ్చాడు. నేను కోపగృహంలో ఒక మూల అలకతో రోదిస్తూ ఉండటం చూశాడు. శ్రీకృష్ణుడు ఆశ్చర్య పోయాడు. తనకు కారణం తెలియలేదు. 'సత్యభామ ఆభరణాలన్నీ తీసివేసి, మాసిన చీరకట్టి మౌనంగా రోదిస్తూ ఇలా చీకటి గృహంలో శోకసముద్రంలో మునిగి ఎందుకు ఉన్నది?' అనుకుంటూ మృదు మధురంగా ప్రేమగా 'సత్యా! ఇదంతా ఏమిటి? నా వల్ల ఏం పొరపాటు జరిగింది? ఎప్పుడూ ఆనందోత్సాహాలతో చిరునవ్వులు చిందిస్తూ స్వాగతం పలికే నీవు ఈవేళ ఎందుకు ఈ విధంగా కన్నీరు పెడుతున్నావు? ప్రియా! నీ కనులలో అశ్రువులా! అసలు ఏం జరిగింది చెప్పు' అని అనునయిస్తూ అన్నాడు. నేను 'నా భ్రమ ఈనాడు తొలగిపోయింది. స్వామీ! నేను వంచితను. ఇన్నాళ్ళ ఊహాలోకంలో భ్రమలలో జీవిస్తున్నాను' అని వెక్కివెక్కి ఏడుస్తూ అన్నాను.



'ఏమంటున్నావు దేవీ! నీవు మోసగించబడ్డావా! నిన్ను మోసగించిన వాడిని.... నిన్ను వంచించినవాడిని ఈ పధ్నాలుగు లోకాలలో ఎక్కడ దాగిఉన్నా సరే, ఆఖరికి పాతాళంలో దాగినా, పట్టి తెచ్చి నీ ఎదుట నిలబెట్టి, నీవు ఏ దండన విధించమంటే ఆ దండన విధిస్తాను' అన్నాడు శ్రీకృష్ణుడు. 'అవసరం లేదు. స్వామీ! మీరు ఆ వంచకుణ్ణి పట్టుకోవటానికి పాతాళందాకా పోనక్కరలేదు. మీరు అసలు కష్టపడాల్సిన అవసరమే లేదు. ఇంకెవ్వరి వల్లనో మోసపోయి ఉంటే నేను ఇంత బాధపడి ఉండను. నా సర్వస్వమని నమ్మి, నా సర్వాస్వాన్నీ ఏ స్వామికి అర్పించుకున్నానో, ఆ స్వామి చేతనే వంచింపబడ్డాను. మీ ప్రేమ సామ్రాజ్యానికి పట్టపురాణిని అన్న నా కలలన్నీ కల్లలు చేస్తూ మీరే నన్ను మోసగించారు. 'అరెరే! సత్యా!ఈ కృష్ణుడు ఎన్నడైనా, ఎవరినైనా మోసగించగలడా! అందులోను నాకు అత్యంత ప్రేమపాత్రురాలవు, ప్రియసఖివి అయిన

నిన్ను వంచించటమా? అది కలలోకూడ జరగనిది. అనూహ్యం. ఎంత చిక్కు సమస్య సృష్టించావు దేవీ..." ఇకచాలు ఆపండి! ఇంతకాలం ఇటువంటి కల్లబొల్లి మాటలతో నన్ను మభ్యపెడుతూ వచ్చారు. నా కృష్ణునికి అత్యంత ప్రియమైన వారందరిలో నేనే అత్యంత ప్రియమైనదానిని, కృష్ణుని ప్రేమ నాకే సొంతం... అని అపోహపడ్డాను.'

'సత్యా! అది పరమసత్యం. ఇప్పుడు దానికి ఏం భంగం కలిగింది? ఈ కృష్ణుడు ఏనాటికీ నీ ప్రేమకు దాసుడే.' 'ఈ నటనలు ఇంకచాలు. మీరు పలికినది సత్యమే అయితే ఆ బ్రహ్మ కమలాన్ని రుక్మిణికి ఇచ్చి ఉండేవారే కాదు. ఔనౌను! ఆ కమలాన్ని కొప్పులో తురుముకొని రుక్మిణి మీకు యక్షకన్యలా, మెరుపుతీగలా కనిపించింది కదూ! ఆ సమయంలో ఈ సత్య ఉన్నదన్న సంగతి తమకు జ్ఞప్తి ఉండే అలా చేశారా?'

కృష్ణుడికి విషయం అర్థమైంది. ఆ నీలమేఘశ్యాముడి ముఖం మరింత శ్యామలమైంది. సత్య ఏమన్నది? రుక్మిణి ఎడల ఆమె మనస్సులో అంత ఈర్ష్య ఎలా కలిగింది? నా సాన్నిధ్యంలో ఇంతకాలంగా ఉన్నా నా అన్నులమిన్న సత్య మనస్సు ఎలా అంత కలుషితం కాగలిగింది? దీర్ఘాలోచనలో పడి వివర్ణమైన కృష్ణుని విషణ్ణ వదనాన్ని సత్యభామ నిరాసక్తంగా చూసింది. ఇంతకాలం కృష్ణుడు ఎంతో జాగ్రత్తగా దాచుకొన్న రహస్యం ఈనాడు బయటపడింది. తానే కృష్ణుణ్ణి నేరం చేస్తుండగా పట్టుకుంది. విజయ రేఖలు ఆమె ముఖంలో ద్యోతకమయ్యాయి. కృష్ణుడి నాటకాన్ని కట్టించగలిగానన్న విజయగర్వంతో ఆమె ముఖం విప్పారింది.

కృష్ణుడు లేచి ఆమె భుజాలమీద చేతులువేసి "సత్యా! నీవు ఆవిధంగా భావించావా! ఒక్క కమలం నీ అంతరంగాన్ని అంతగా కలచి వేస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు సుమా! అలా అనుకొని ఉంటే, దేవర్షి నారదుడు ఇచ్చిన ఆ ప్రసాదాన్ని తిరిగి శివచరణములకే సమర్పించి ఉండేవాడిని' అన్నాడు. నాకు నోట మాటరాలేదు. ఎందుకంటే ఆ మాటలు అంటున్నప్పుడు కృష్ణుడి ముఖంలో ద్యోతకమైన బాధను, వ్యధను నేను అంతకుమునుపు ఎన్నడూ చూచి ఉండలేదు. బాధతో కృష్ణుడు ఇక మాట్లాడలేక మౌనం వహించాడు. నేను అప్రతిభురాలనైనాను. నాకు తెలియకుండానే నేను నిర్దోషి అయిన కృష్ణుణ్ణి నిందిస్తూ కించపరచలేదు కదా! ఆ స్వామి ముఖంలో నేను మున్నెన్నడూ చూడని దైన్యము, విషాదరేఖలు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఒక్క క్షణం కృష్ణుని చరణాలు పట్టుకుని క్షమించమని ప్రార్థిస్తే? కాని అంతలోనే స్వభావ సిద్ధమైన స్వాభిమానం అడ్డువచ్చింది. కృష్ణుణ్ణి అక్కడే వదిలి నేను మరొక గదిలోకి వెళ్ళిపోయాను."

- సశేషం

# నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

భక్తి సూత్రము 63: **స్త్రీధననాస్తికవైరిచరిత్రం న శ్రవణీయం**

తాత్పర్యము: భక్తి మార్గంలో నడిచే సాధకుడు విషయాదులను, ధనలోభాన్ని, దైవ శ్రద్ధను చెడగొట్టే అవిశ్వాసాన్ని, ద్వేషాన్ని పెంచే శత్రు కథలను ఆసక్తిగా వినకూడదు. ఈ నారద భక్తి సూత్రం సాధకుడి మనస్సును ఎలా నియంత్రించాలో చెప్పే అత్యంత ఆచరణాత్మకమైన హెచ్చరిక.



భక్తి మార్గంలో శ్రవణం ఒక పవిత్ర సాధనం. భగవంతుని గుణాలు, నామం, సద్గురు ఉపదేశం వినడం ద్వారా మనస్సు పవిత్రమవుతుంది. అదే శ్రవణ శక్తి తప్పు దిశలో వెళ్తే, మనస్సు కూడా అదే దిశలో ప్రవహిస్తుంది. అందుకే నారదుడు ఏమి వినాలి అనే దానికంటే ముందు, భక్తికి హానికరమైనవి ఏమి వినకూడదో ఇక్కడ సూచిస్తున్నాడు. ఎందుకంటే మనం ఏది వింటామో, అదే మనస్సులో వాసనగా నిలిచి, భక్తిని బలహీనపరుస్తుంది.

శ్రీ బాబూజీ మహారాజ్ వారు కూడా తమ బోధనలలో సాధనలో శ్రవణం యొక్క ప్రాముఖ్యతను అనేక మార్లు వివరించారు. ఈ సూత్రములో పైకి కనిపించే అర్థం, స్త్రీ, ధనం, నాస్తికులు, శత్రువుల చరిత్రలు వినకూడదని ఉన్నప్పటికీ, దీని అంతరార్థం వ్యక్తుల పట్ల ద్వేషం కాదు. ఇది భక్తి మార్గంలో మనస్సును దారి మళ్ళించే విషయాల నుంచి రక్షించుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. ఇక్కడ ముఖ్యంగా "స్త్రీ" అనే పదాన్ని వ్యక్తిగత స్త్రీగా కాకుండా, ఇంద్రియాసక్తిని, ప్రకృతి ఆకర్షణను సూచించే సంకేతంగా అర్థం చేసుకోవాలి.

ఇంకా లోతుగా పరిశీలిస్తే, ఇక్కడ "స్త్రీ" అనే పదం ప్రకృతి ఆకర్షణకు సంకేతం. ప్రకృతి మూడు గుణాలైన సత్త్వం, రజస్సు, తమస్సులతో నిండి ఉంటుంది. సత్త్వం ప్రకాశం, శాంతిని ఇస్తుంది; రజస్సు చలనం, కోరిక, ఆవేశం, ఆసక్తిని కలిగిస్తుంది; తమస్సు మోహం, అవివేకం, అలసత్వం, బంధనాన్ని పెంచుతుంది. సాధకుడికి విషయాసక్తి కూడా ఈ మూడు గుణాల ద్వారానే పనిచేస్తుంది. త్రిగుణమయమైన ప్రకృతి మోహం మనస్సును భక్తి నుంచి దారి మళ్ళించే విధానాన్ని నారదులు ఈ సూత్రంలో సూచిస్తున్నారు.

భగవద్గీత రెండవ అధ్యాయంలో గీతాచార్యులు **ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే। సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోఽభిజాయతే** అంటూ "మనిషి బాహ్య విషయాదులను మళ్ళీ మళ్ళీ ధ్యానిస్తే వాటిపై ఆసక్తి పుడుతుంది; ఆసక్తి నుంచి కోరిక, కోరిక నుంచి క్రోధం పుడుతుంది" అని వివరిస్తారు.

మొదట వినడం, చూడడం, ఆలోచించడం మాత్రమే అనిపించినా, అది క్రమంగా అంతరంగంలో బంధనంగా మారుతుంది. శ్రవణం ద్వారా లోపలికి వచ్చిన విషయం, మనస్సులో నిలబడిపోయి, తరువాత వాసనగా నిలిచి, చివరికి ప్రవర్తననే ప్రభావితం చేస్తుంది. అందుకే నారదులు శ్రవణ స్థాయిలోనే జాగ్రత్త పడాలని సెలవిస్తున్నారు.

ధనం ధర్మబద్ధంగా సంపాదించడం, కుటుంబాన్ని పోషించడం, దానం చేయడం, సేవ చేయడం తప్పు కాదు. కానీ ధనం మీద అత్యాశ, లాభనష్టాలపై నిరంతర చర్చ, ఇతరుల సంపదపై అసూయ, ఇంకా కావాలనే లోభం మనస్సును భక్తి నుంచి దూరం చేస్తాయి. ఈశావాస్య ఉపనిషత్తు మొదటి మంత్రం జగత్తంతా ఈశ్వరునిదిగా భావించి, త్యాగభావంతో అనుభవించాలని, ఇతరుల ధనంపై ఆశ పెట్టుకోకూడదని బోధిస్తుంది. ధనం చేతిలో సాధనం అయితే ధర్మానికి ఉపయోగపడుతుంది; కానీ ధనం మీద అత్యాశతో భక్తి బలహీనపడుతుంది.

"నాస్తిక" అనే పదం కూడా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఇది ప్రశ్నలు అడిగేవారిని లేదా వేరే అభిప్రాయాలు కలవారిని ద్వేషించమని కాదు. నిజమైన ధర్మచర్చలో ప్రశ్నలు, విచారణ కూడా అవసరం. కానీ భక్తుని శ్రద్ధను చెడగొట్టే విధంగా దైవాన్ని ఎగతాళి చేయడం, వేదాలను నిరాకరించడం, ఆధ్యాత్మిక విలువలను హాస్యంగా చూపించడం మొదలైనవి సాధకుని అంతరంగాన్ని బలహీనపరుస్తాయి.

"వైరి చరిత్రం" అంటే శత్రువుల కథలు, విరోధుల గురించి అపవాద సంభాషణలు, మనకు నష్టం చేసినవారి గురించి వినడం, మాట్లాడడం. ఇది ద్వేషాన్ని పెంచుతుంది. భక్తి యోగము భక్తుని స్వభావాన్ని వివరిస్తూ నిజమైన భక్తుడు ఎవరి పట్ల ద్వేషం పెట్టుకోడని తెలియజేస్తుంది. కాబట్టి శత్రు కథలను ఆసక్తిగా వినడం, వారి పట్ల ప్రతీకారం భావాన్ని పెంచుకోవడం భక్తికి వ్యతిరేకం.

ఈ నాలుగు విషయాలు కామం, ధనలోభం, అవిశ్వాసం, ద్వేషం - భక్తి మార్గంలో ప్రధాన మానసిక విఘ్నాలు. అందువల్ల ఈ సూత్రం నిషేధాత్మక ఆజ్ఞలా కనిపించినా, వాస్తవానికి ఇది మనస్సును రక్షించే సానుకూల సాధన నియమం.

ఇంద్రియ విషయాల శ్రవణం తగ్గినప్పుడు, భగవద్గుణాల శ్రవణం పెరిగే అవకాశం కలుగుతుంది. శ్రవణం పవిత్రమైతే మనస్సు పవిత్రమవుతుంది; శ్రవణం కలుషితమైతే మనస్సు కూడా కలుషితమవుతుంది. చెవులు హృదయానికి ద్వారం. అందుకే భక్తుడు భగవద్గుణాలు, సత్సంగం, నామసంకీర్తనం, శాస్త్రం వంటి భక్తిని పెంచే విషయాలను వినాలని, కామం, లోభం, అవిశ్వాసం, ద్వేషం, త్రిగుణమయమైన విషయ మోహాన్ని పెంచే కథలను ఆసక్తిగా వినకూడదని నారదులు ఈ సూత్రం ద్వారా సూచిస్తున్నారు.

- సశేషం

## శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

జులై 2026

9 గురు: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

12 ఆది: మాసశివరాత్రి

14 మంగళ: అమావాస్య

17 శుక్ర: కర్కాటక సంక్రమణం - దక్షిణాయన పుణ్యకాల ప్రారంభం

25 శని: తొలి ఏకాదశి - ఏకాహం సంకీర్తన, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

29 బుధ: ఆషాఢ పూర్ణిమ - గురుపూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

ఆగస్ట్ 2026

8 శని: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

11 మంగళ: మాసశివరాత్రి

12 బుధ: అమావాస్య

13 గురు: 13.08.2026 - 17.08.2026 వరకు భీమవరం శాఖ సత్సంగ సమావేశములు

15 శని: శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

21 శుక్ర: వరలక్ష్మీ వ్రతం

28 శుక్ర: శ్రావణ పూర్ణిమ - రాఖీ పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

# మమకారం

-కీ.శే. పెనుమాక నాగేశ్వర రావు

"మమకారములో పడకుమురా మాధవుని తలపరా జీవా" అని మాతాజీ పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. మనలో చాలా మందికి మమకారం వదలటం లేదు. నిజం మాట్లాడుకుంటే... అహంకారాన్ని అయినా అరనిముషం మరువగలుతున్నామో, మరుగున పడేస్తున్నామో కానీ మమకారం మాత్రం వదిలించుకోలేకపోతున్నాం. పుడుతూనే పాలకేడ్చి, పుట్టీ జంపాలకేడ్చి, పెరిగి పెద్దయ్యాక, ముద్దూ మురిపాలకేడ్చి అని ఓ సినీగీతంలో చెప్పినట్లు జీవితం అంతా ఏదో ఒకదానికోసం వెంపర్లాడటమే జరుగుతున్నది. ఆ వెంపర్లాటలోనుండి పొందినదాని పట్లే మమకారం పెరుగుతున్నది. వ్యక్తుల పట్లనే కాదు, వస్తువుల పట్ల, వాహనాల పట్ల, గృహాల పట్ల...ఇలా చెప్పుకుంటూ పోతే 'మన' అనుకున్న ప్రతి దానిపట్ల మనకి మమకారం ఏర్పడుతున్నది. అందుకే కాబోలు ఓ జ్ఞాని "అంతా నాదే అనుకోవటం నుంచి అంతా నేనే" అనుకునే వరకు ఎదగండి. అప్పుడు మమకారం ఉండదు అన్నాడు. నిజమే. ఆచరణలో పెట్టటం ఎంత కష్టం!

చాలా కాలం క్రితం గుంటూరులో వారం వారం సత్సంగ కార్యక్రమాలు క్రమం తప్పకుండా జరుగుతుండేవి. అలా ఆ కార్యక్రమ సభ్యుడిగా ఓ ఇంటి గృహ ప్రవేశానికి ఆహ్వానం మేరకు వెళ్ళాను. ఆ ఇంటి ఇల్లాలు ఎదురొచ్చి సాదరంగా పలుకరించి అల్పాహారం అందించి, "ఏమిటోనండీ మా వారూ, పిల్లలు కావాలని పాత ఇంటిని తీసేసి సకల సౌకర్యాలతో ఈ ఇల్లు కట్టించారు గానీ, ఇదెంత బాగున్నా, నాకు మా పాత ఇల్లంటేనే ఇష్టం. ఆ ఇంటికి బాబుగారు వచ్చారు, మాతాజీ వచ్చారు" అని చెప్పగా విని విస్తుపోయాను. విస్తుపోవటానికి కారణం నేనే. అవును నేను చాలా కాలం వాడిన లూనా అనే వాహనాన్ని అమ్మి మరో కొత్త వాహనం కొనుక్కున్నాను. చాలా కాలం వరకు ఆ అమ్మేసిన వాహనం మీదనే నా ఆలోచన ఉండేది. ఇలా నాలా చాలా మందికి అనిపిస్తుందన్నమాట అనుకుని నన్ను నేను సమర్ధించుకున్నాను.

మనలో చాలా మందిమి ఇంట్లో వుండే పాత సామాన్లని బయట పడేసేందుకు ఇష్టపడం. ఒకవేళ పిల్లలు గోలచేసినా, మన మనసు ఒక పట్టాన ఒప్పుకోదు. మనసు మారాం చేసి తీరుతుంది. అవి ఎంత పనికిరానివైనా, తట్టలు, బుట్టలు, గిన్నెలు, గ్లాసులు, గాజుసీసాలు, డబ్బాలు, రోలు, రోకలి వగైరా వగైరా.... ఏ వస్తువైనా కానివ్వండి దాని వెనుక ఓ కథ, ఓ జ్ఞాపకం, తప్పకుండా వుండి వుంటుంది. కథ మరచిపోయి, వస్తువును

పారవేసేందుకు మనసొప్పదు. ఎంత పాతబడిన వస్తువునైనా ఇంట్లో ఏదో మూల పడేస్తామేగానీ పారెయ్యము. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అనే నమ్మకం. పాత వస్తువైనా కనిపించక పోతే మనసు విలవిల్లాడిపోతుంది. అది కనిపించిందాకా మనసంతా అశాంతే. పాతను ప్రేమించడం గౌరవించడం మన సంస్కృతిలో భాగం. మన సంస్కారంలో భాగం. అది మనకు తెలీకుండానే మన నరనరాల్లో వున్నది. పండుగపూట కూడా పాత మొగుడేనా అనుకోదు భార్య, పండుగపూట కూడా పాత భార్యేనా అనుకోడు భర్త. వారిద్దరూ జీవితాంతం కలసి వుండాల్సిందే. మనది యూజ్ అండ్ త్రో సంస్కృతి కాదు. (..ఇవి నేను ఏదో కథలో వ్రాసిన వాక్యాలు. సందర్భోచితం అనిపించి ఆ వాక్యాలని ఇక్కడ ఉటంకించాను.)

మాతాజీ చాలా సార్లు గుంటూరులో పాండుగారి ఇంటి గురించి చెప్పారు. వింటుంటే ఆ ఇంటి గేటు లోపలికి వెళ్ళగానే కనిపించే పెద్ద బావి, పైకి వెళ్ళేందుకు మెట్లు, అక్కడ విడిచిన చెప్పులు, ఓ కుక్క ఇవన్నీ కళ్ళముందు కనపడతాయి. నేను శ్రీ బాబూజీని మొట్టమొదటిసారి దర్శనం చేసుకున్నది ఆ ఇంట్లోనే. అందుకే ఆ ఇల్లు మా మొదటి ఆశ్రమం అని భావిస్తుంటాను. ఆ ఇల్లు కూడా రీ మోడల్ చేయబడింది. ఈ విషయం కూడా మాతాజీ చెబుతుంటారు.

అంతదాకా ఎందుకు మా కుటుంబం ఆ మధ్యన ద్వారకా తిరుమల వెళ్ళి తిరిగి వస్తూ చాలా కోరికగా గుండుగొలను గ్రామం వెళ్ళాము. మేడబాబు గారి ఇల్లు, మాకు ఒకటి రెండు సార్లు బసకి ఇచ్చిన డాక్టర్ శేషగిరిరావు గారి ఆసుపత్రి (అప్పుడు నాకు తెలీదు. నా వయసు ఎనిమిది, తొమ్మిది సంవత్సరాలు) ఆ పరిసరాలు చూసి తన్మయుడ్ని అయ్యాను. ఆ జ్ఞాపకాలు, బాబూజీ బోధలు, శ్రీహరిగారు తీర్థం ఇవ్వటం, ఇంకా కొద్దిమంది పెద్దల కదలికలు గుర్తుకు వచ్చి మహా ఆనందం వేసింది. అటాచ్‌మెంట్, మమకారం వేర్వేరు అంశాలే కావచ్చు. కొందరు వ్యక్తులతో, ప్రదేశాలతో ఏర్పడిన అనుబంధం ఒకరకంగా మమకారంగా మారవచ్చు. కాదనలేం. ఏది ఏమైనా, భవబంధం కాని బంధం మనది, భగవత్ సంబంధం మనది అనుకుని ఆనందపడదాం. అదినాది, ఇదినాది అనుకోకుండా, కలిమీ నీ దయ, లేమియు నీ దయ, నీ దయలేనిదే ఏమియు లేదయా అని అనటం మాత్రమే కాకుండా, అనుకోవటంలోని ఆనందం అనుభవిద్దాం. జై సద్గురు మహరాజ్‌కి జై.

# మాయా విలాసం

-వేలమూరి రవికుమార్

(గత సంచిక తరువాయి)

కీర రాజ్యంలో రాజు గారు మరణించారు. రాజు లేకపోతే రాజ్యం పరాయి రాజుల పాలైపోతుందని ఆ రాజ్యపు మంత్రిగణం అంతా కూర్చుని విచారించారు. ఆ రాజ్యానికి ఆ క్షణమే ఒక రాజుని నియమించాలని నిర్ణయించారు. రాజు ఎవరో నిర్ణయించే అధికారం ఆ రాజ్యపు పట్టపు ఏనుగుకి అప్పగించారు. ఆ పట్టపు ఏనుగు ఎవరి మెడలో వరమాల అలంకరిస్తే, వారే ఆ రాజ్యానికి రాజు. పట్టపు ఏనుగుని అలంకరించి, దాని తొండానికి ఒక వరమాలనిచ్చి రాజవీధుల్లో వదలిపెట్టారు. ఆ ఏనుగు నడిచే వేగానికి భయపడి స్వయంవరానికి వచ్చిన పలు రాజులు పారిపోయారు. ఎవరికీ ఎదురువెళ్ళే ధైర్యమే లేదు. ఒక వీధిలో ఈ కటంజుడు నడుస్తూ వుండగా ఈ పట్టపు ఏనుగు వరమాలతో రావడం గమనించి ఇక తనకు చావు తప్పదని, ఇది నిశ్చయమని తలచి చేష్ఠలుడిగి అలా నిలుచుండిపోయాడు. ఆ ఏనుగు కటంజుడి మెడలో వరమాల వేసింది. దానితో మంత్రిగణమంతా అది దైవ నిర్ణయంగా భావించి, అతని పూర్వాపరాలు విచారించకుండా అతనిని తమ రాజుగా ఎన్నుకున్నారు. అతనికి గవలుడు అనే పేరుతో రాజ్య పట్టాభిషేకం చేశారు.

గవల మహారాజు 12 సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు. అన్ని అంతఃపుర మర్యాదలు, గౌరవాలు పొంది, ఆనందంగా కాలం గడుప సాగాడు. ఒక్కొక్కసారి మాత్రం తాను ఎప్పుడూ నిండు పట్టువస్త్రాలు, ఆభరణాలు, కిరీటంతో వుండటం చాలా ఇబ్బందిగా అనిపించేది. ఇలా జరుగుతుండగా తన అంతఃపురానికి దూరంగా కిరాతులు మంట వేసుకుని చలి కాచుకుంటూ, తనకు పూర్వ జీవితంలో భాగమైన పాటలు పాడుతూ మద్యం సేవిస్తూ, చిందులు వేయడం చూశాడు. దానిపై వున్న విపరీతమైన ఆకర్షణతో, శరీరంపై వున్న నగలు, దుస్తులు, కిరీటం అన్నీ తీసివేసి, చర్మము ధరించి, అంతఃపురం వదలిపెట్టి బయటకు వారి వద్దకు వెళ్ళి తాను కూడా వాళ్ళతో కలిసి, మద్యం సేవించి, గంతులు వేయసాగాడు. ఇంతలో ఆ కిరాతులలో ఒక వృద్ధుడు

గవల మహారాజును గుర్తించి, 'ఒరేయ్! కటంజా! ఎలా వున్నావు? ఎక్కడ వుంటున్నావు?' అంటూ పలు ప్రశ్నలు సంధించాడు. అప్పుడు గవల మహారాజు తన పూర్వ వృత్తాంతం అంతా బయటపడుతుందని, వారికి ఏ సమాధానము చెప్పకుండా, అక్కడి నుండి వడివడిగా అడుగులు వేస్తూ తన అంతఃపురానికి వచ్చేశాడు. ఇది అక్కడ వున్న వేగులు దూరం నుంచి గమనిస్తున్న మంత్రులకు చేరవేశారు. మంత్రిగణం అంతా కలిసి ఆ కిరాతులను పిలిచి విచారించగా, గవల మహారాజు పూర్వ వృత్తాంతమంతా తెలియజేశారు.

మహామంత్రి మరియు మిగిలిన మంత్రులందరూ ఒక కిరాతుని రాజుగా చేసిన పాపానికి, అతనికి ఉత్తమ బ్రాహ్మణులచేత సత్కారాలు అందింపజేసిన పాపానికి మరియు అంతఃపుర స్త్రీలను వానికి పని చేయడానికి నియమించిన పాపానికి ప్రాయశ్చిత్తంగా అంతఃపురం ముందర ఒక పెద్ద అగ్ని గుండం నిర్మింపజేసి, వారు అందులో దూకి ప్రాణత్యాగం చేశారు. వారితో పాటు ఆ రాజును సేవించిన రాణులు, అంతఃపుర స్త్రీలు కూడా ఆ అగ్నిగుండంలో దూకి ఆత్మాహుతి చేసుకున్నారు. ఇన్ని సంవత్సరాల సాంగత్యం వలన కటంజుని మనసు మారినదై వుండటం వలన గవల మహారాజైన కటంజుడు, తన వలనే ఈ ఆపద సంభవించిందని ఎంతో కలత చెంది తాను కూడా ఆ అగ్ని గుండంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

- సశేషం

***గురువు అమృత సరస్సు. గురూపదేశాన్ని మననం చేస్తే శిష్యుని అజ్ఞానం నశిస్తుంది. గురువు లభించిన వెంటనే సంశయాలన్నీ పటాపంచలు అవుతాయి. అమృతమే స్రవిస్తుంది.***

- శ్రీ కాళీబాబు

# మాటకన్న మిన్న - మౌనభాష

- ప్రసాదవర్మ కామఋషి

మౌనం మనతో మనం సంభాషించుకోవటానికి గల గొప్ప అవకాశం. నిజమైన నిర్దుష్టమైన జ్ఞానానుభవమే మౌనం. ఈ మౌనమన్నది లౌకిక ఆధ్యాత్మిక రంగాలలో, మన దైనందిన జీవితంలోను, ప్రాముఖ్యత సంతరించుకున్న విషయం. దాని పట్ల ధ్యాస పెట్టక ద్వితీయ స్థానానికి నెట్టేయ్యటమో, అసలు పట్టించుకోక పోవటమో చేస్తాం. **మనః ప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః।**

**భావసంశుద్ధిరిత్యే తత్ తపో మానస ముచ్యతే॥**

అని గీతాచార్యుని మాట. మనస్సు నిరంతరము పరమేశ్వరుని యొక్క గుణ, తత్త్వ, స్వరూప, ప్రభావ, నామ చింతనాదులయెడ లగ్నము చేయుట, ఒక్క మాటలో చెప్పాలంటే బ్రహ్మవిచారమునందే మనస్సు లగ్నము చెయ్యటం మౌనం. మౌనం అనగానే మనకు స్ఫురించే దైవం దక్షిణామూర్తి. వారు మౌనముతోనే పరబ్రహ్మ తత్త్వాన్ని శిష్యులకు ఉపదేశించారు. వారి వారి సంశయాలు తీరిపోయాయి. స్వామి ఏం చెపుతున్నారో, ఈ శిష్యులకు ఏం అర్థమయినదో చూసేవారికి తెలియటం లేదు. కాని శిష్యుల ముఖాలలో కనిపిస్తున్న తృప్తి, ఆనందాలను బట్టి వారి సంశయాలు తీరినట్టు తెలుస్తోంది.

**కలౌ స్మరణాన్ముక్తిః** కలియుగంలో భగవన్నామం మనసులో స్మరించినంత మాత్రం చేతనే ముక్తిని పొందవచ్చునన్నారు శంకరులు. శివమానస పూజ అనే గొప్ప స్తోత్రాన్ని మనకందించారు. కేవలం మనసుతోనే పరమశివునికి షోడశోపచార పూజ ఎలా చెయ్యవచ్చో ఈ స్తోత్రం తెలియచేస్తుంది.

రిబెకోవ్ రష్యన్ ఎకాడెమీ ఆఫ్ సైన్సెస్ లో ప్రొఫెసర్, మాస్కోలోని ఓరియంటల్ స్టడీస్ ఇన్‌స్టిట్యూట్‌కి అధ్యక్షుడు కూడా. ఆయన ఒకసారి మద్రాస్ వచ్చి కంచి మహాస్వామి వారిని దర్శించాడు మొదటిసారిగా. స్వామివారిని అడగాలని కొన్ని ప్రశ్నలు వ్రాసుకొచ్చాడు. స్వామివారు కొద్దిసేపు అతడి ముఖంలోకి చూశారు. క్షణాల్లో అతడు ఆనందబాష్పాలు కారుస్తూ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. స్వామి 'అతడు యేం అడగాలనుకున్నాడో అడగమను' అని పక్కనున్నవారితో అన్నారు. రిబెకోవ్ 'నా ప్రశ్నలన్నిటికీ జవాబులు దొరికాయి, నేను ఇక యేమీ మాట్లాడ దలచలేదు' అన్నాడు.

రమణభగవాన్ తిరువణ్ణామలై చేరుకున్న నాటినుంచి ఒక దశాబ్దం పైగా మౌనంగానే గడిపారు. మౌనంగా ఉండటమే వారికిష్టం. గణపతి మునికి తపస్సుకి అర్థం వివరించటానికి ఆ మౌనం వదిలారు. పదేళ్ళలోపు చిన్నపిల్లలు రోజూ కొండ

ఎక్కి మహర్షి ఉన్న గుహకి వచ్చి, మహర్షి ఎదుట కాస్సేపు కూర్చుని నిశ్శబ్దంగా లేచి వెళిపోయేవాళ్ళు. మహర్షి అవసరం పిల్లలకేం ఉంటుంది? పిల్లలతో రమణులకేం పని? ఈ ప్రక్రియకి జవాబు మాటల్లో దొరకదు, తర్కానికందదు.

చూపులతోనే సందేశము, మౌనంతోనే ఉపదేశమూ వారి శైలి. గురుశిష్యుల మధ్య మాటల అవసరం ఏమిటని వారి ప్రశ్న ! ప్రఖ్యాత ఆంగ్ల రచయిత సోమర్‌సెట్ మామ్ భగవాన్‌ని దర్శించి, వారి ఎదుట కూర్చున్నాడు, ఒక గంట గడిచిపోయింది. ఎన్నో ప్రశ్నలతో వచ్చాడు మామ్. అడగలేక పోయాడు, ప్రక్కనున్న స్నేహితుడు 'అడుగూ' అన్నాడు. "అంతా అయిందిలే, హృదయాలు మాట్లాడుకున్నాయి, నిశ్శబ్దంగా జరిగి పోయింది" అన్నారు మహర్షి.

జిల్లెళ్ళమూడి అమ్మ అరుణాచలం నుండి తిరిగి వస్తూ కలువాయ్ గ్రామంలో విడిదిచేసి ఉన్న కంచి మహాస్వామి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి వారిని చూడటానికి వెళ్ళారు. రాత్రి సమయమనిగాని, స్త్రీ దర్శనమని గాని ఎంచక యతి నియమాల్ని పక్కన పెట్టి స్వామి అమ్మ దర్శనానికొచ్చారు. ఇరువురి మధ్యా సుమారు 15 నిముషాల పాటు జరిగింది మౌన సంభాషణే! కాష్ఠమౌనం!

మెహెర్‌బాబా వారి 31వ యేట, నేటి నుంచి మౌనం పాటిస్తాను అని చెప్పి, మౌనాన్ని ఆశ్రయించి జీవితాంతం పాటించారు. ఆ 44 యేళ్ళ మౌన జీవితంలో వారెంతో సేవ చేశారు. నిజానికి నేనెప్పుడూ మౌనంగా లేను, ప్రతివారి హృదయంలో నిత్యం పలికే స్వరాన్ని నేను, భగవంతుడు హృదయ భాషకు మాత్రమే స్పందిస్తాడు, నాలుక మీదనుంచి వచ్చే భాష వినడు అంటారు. వారి సన్నిధిలో గడిపిన వారెవరికీ బాబా మౌనంగా ఉన్నారని ఎన్నడూ అనిపించక పోవటం గమనార్హం.

బాబూజీ వారు కూడా మౌనానికి ఎంతో ప్రాధాన్యమిచ్చిన సంఘటనలు కనిపిస్తాయి. ధ్యానం ద్వారా ఎంతో ఆధ్యాత్మికోన్నతి పొందవచ్చు అన్నది బాబూజీవారి ఆదేశం. ధ్యానం అంతా మౌన ప్రపంచంలోనే కదా జరిగేది. మనసులోని వాసనలు హరించాలంటే కేవలం "ధ్యానం" ద్వారానే సాధ్యమవుతుంది. **జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణి** అన్నాడు గీతాచార్యుడు, "**ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి**" అంటున్నాడు మీ హృదయబాబు. జపమాల ఆగిపోవాలి, శబ్దం ఆగిపోవాలి. అప్పుడు మనసు తారక బ్రహ్మమందు నిలచి లక్ష్యార్థము చేరుకొనుటకు మార్గం సుగమమవుతుంది అంటారు.

ఒకసారి బాబూజీ రమణాశ్రమానికి వెళ్ళినపుడు, "కుట్టీ ఇంగే వా అప్పా" అని పిలిచి రమణులు తమ పక్కనే భోజనానికి కూర్చోబెట్టుకున్నారు. అప్పుడు ఆరాధనా భావంతో బాబూజీ చూపులు, ఆత్మీయతతో మహర్షి చూపులు మౌనంగానే

మాట్లాడుకున్నాయట! మౌనవ్యాఖ్యతోనే పరస్పరం ఏమేమి వెల్లడించుకున్నారో మరి మనబోటి సామాన్యులకు అగ్రాహ్యం.

నిశ్శబ్దంలో ప్రతి శబ్దం నిక్షిప్తం, ప్రతి శబ్దంలో నిశ్శబ్దం సంక్షిప్తం. మన మౌనాన్ని అర్థం చేసుకోలేని వాడు మన మాటనూ అర్థం చేసుకోలేడు. నిద్ర శరీరానికి విశ్రాంతి నిచ్చినట్టే మౌనం మనసుకు విశ్రాంతినిస్తుంది. మాటలు తాళంచెవి లాంటివి, యే హృదయాన్నయినా తెరవగలవు, యే నోటినైనా మూయించగలవు. సాధారణంగా మనిషి పుట్టినాక ఒకటి రెండు సంవత్సరాలలో ఎలా మాట్లాడాలో నేర్చుకుంటాడు. కాని ఎలా మాట్లాడకూడదో తెలుసుకోవటానికి జీవితకాలం సరిపోదని అంటారు జీవితాన్ని వడపోసిన పెద్దలు. అసలు భగవంతుడు మనకు నోరు ఒకటే, చెవులు రెండు ఇచ్చాడంటే మాట మౌనం నిష్పత్తి 1:2 గా ఉండాలనేనేమో. వినటం ఎక్కువగాను, మాట్లాడటం తక్కువగాను చెయ్యమంటారు విజ్ఞులు.

**సమర్థ సద్గురు మాసపత్రిక వారి విన్నపము**

ఉదార దాతల సహకారంతో గత కొన్ని సంవత్సరాలుగా సమర్థ సద్గురు తెలుగు మాసపత్రిక తెలుగు రాష్ట్రాలలోని అనేక గ్రంథాలయాలకు చేరుతూ, అనేక మంది పాఠకులకు జ్ఞానసేవ అందిస్తోంది. ఈ గ్రంథాలయ చందాలలో చాలావాటి గడువు త్వరలో ముగియనున్నందున, ఈ సేవ నిరంతరంగా కొనసాగేందుకు భక్తులు, పాఠకులు విరాళాలతో ముందుకు రావలసిందిగా మనవి.

అలాగే, పుట్టినరోజులు, వివాహాలు, వివాహ వార్షికోత్సవాలు, గృహప్రవేశాలు వంటి శుభ సందర్భాలలో మీ బంధుమిత్రులకు బహుమతి చందాలు (Gift Subscriptions) అందించి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచండి.

మీ సహకారం అనేక మంది పాఠకులకు జ్ఞానదీపంగా నిలుస్తుంది. ఈ సేవకు సంబంధించిన వివరాల కోసం: 8333808310.

భీమవరం శాఖలో 13-8-26 గురువారం నుండి 17-8-26 సోమవారం వరకు పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశములు, శ్రీ శ్రీనివాస రామానుజదాసుగారి ప్రవచనములు జరుగును.

(గత సంచిక తరువాయి) **నిరీక్షణ** తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

నల, నీలుర పర్యవేక్షణలో వానరులు రామనామమును జపించుచూ తీసుకుని వచ్చిన పెద్ద బండరాళ్లను, నరికివేయబడిన వృక్షములను వంతెన కోసం ఎంచుకొనబడిన స్థలమందుంచగ, వంతెన నిర్మించడం పూర్తయ్యింది. సముద్రరాజు కరుణతో అవన్నియూ కలసి ఒక తేలియాడగల వంతెన ఏర్పడింది.

ఇదంతా ఆశ్చర్యంతో వీక్షించుచున్న రాముడు 'ఈ బరువైన రాళ్లు ఎలా తేలుచున్నాయి' అన్న ఆలోచనతో ఒక సాయం సమయం చుట్టూ ఎవరూలేని సమయమున తాను ఒక చిన్న రాయిని ఆ నీటిపై వేయగా అది వెంటనే లోనికి మునిగిపోయింది. ఆకస్మాత్తుగా ఎవరో 'ఫక్కు'మని నవ్వినట్లనిపించగా వెనుకకు తిరిగి చూసిన రామునికి హనుమంతుడు కనిపించాడు. "ఎందులకు నవ్వుచున్నావు హనుమా!?" అని రాముడు ప్రశ్నించ, హనుమంతుడు, "తండ్రీ! మీ చేతినుండి విడిపోయినట్లైతే రాయేమిటి, దేనికైననూ అధోగతియే కదా!?" అన్నాడు.

కొద్ది రోజులలోనే సేతుబంధనం ముగిసిపోయింది. దానిపై సుగ్రీవుడు మొదలైన వాళ్లు ముందు నడువ వానరసేన వారి వెనుక అనుసరించింది. రాముని హనుమంతుడు, లక్ష్మణుని అంగదుడు తమ తమ భుజస్కంధములపై కూర్చుండబెట్టుకుని వారి వెనుక నడుచుకుని వెళ్లారు. తన సేన అంతా సముద్రము దాటిన పిదప రాముడు అంగదుణ్ని పిలిచి రావణుని వద్దకు చిట్టచివరి ప్రయత్నముగా దూతగా పంపి, "ఇప్పటికైనా సీతను నాకు అప్పగించి శరణు వేడుకొనినచో భీకర పోరును నివారించగలమని తెలియజేయుము" అని ఆజ్ఞాపించాడు. అంగదుడు అట్లే చేయగా, రావణుడు దానికి నిరాకరించి పోరుకు సిద్ధపడ్డాడు.

**<u>ప్రథమ కారణుడు వీడే</u>**

అది ఎంతటి భీకరమైన పోరు!? ఉపమానములతో కవిత్వం చెప్పి ఇతరులను సమ్మోహనపరచుటలో ప్రావీణ్యుడు, సంస్కృతభాషా పండితుడు అయిన కాళిదాసు తన 'రఘువంశం' అనబడు కావ్యమందు

సరైన ఉపమానం ఏదియూ లభించకపోవుటచే 'రామ-రావణయుద్ధం ఎలా ఉంది' అంటే "రామ రావణ యుద్ధంలానే ఉంది" అని తెలియజేశారు.

లంకానగరమందు జరిగిన యుద్ధమున అసంఖ్యాకమైన అసురులు, వానరవీరులు వరుసగ సంహరింపబడ్డారు. రాముని యుద్ధప్రావీణ్యమును రావణుని సేనాధిపతులుకూడ కొనియాడారు. దీనితో బుసలుకొట్టే కోపానికి గురైన రావణునికి ఒక భీకరమైన ఆలోచన కలిగింది.

'రాముడు విజయమొందును' అను ఆలోచనతోనే కదా సీత నన్ను ఏవగించుకొనుచున్నది. మాయతో రాముడు మరణించాడని సీతను నమ్మించగలిగితే గనుక ఆమెను తాను సులభముగ కైవసం చేసుకొనవచ్చును కదా' అని అనుకున్నాడు. పిదప రాముడు కూడ మనోవ్యాకులతకులోనై మరణిస్తాడు, లేదా యుద్ధభూమినుండి తిరుగు పయనమై పోతాడు అని పలు పలు విధములుగ మనసులో యుక్తి పన్నుచూ శూన్యకారిని పిలిచి, "అచ్చుగుద్దినట్లుగ రాముని ముఖమువలె నుండునట్లు ఒక మాయాబింబమును అశోకవనమందలి సీత ముందుంచు"మని ఆజ్ఞాపించాడు. ఆతడు రావణుని ఆన మేరకు అటులనే జేయ సీత అది చూసి వెక్కివెక్కి కన్నీరు మున్నీరుగ రోదించింది.

అప్పుడు ఆమె ముంగిట నిలిచిన రావణుడు "జనక పుత్రికా! ఇదిగో యుద్ధమున ఓడిపోయిన నీ భర్త తల. ఇకపై నీకు నేను తప్ప వేరెవరూ గతిలేరు" అని చెప్తుండగ ఒక కాపలాదారుడు ఆతని చెంతకు వచ్చి వానర వీరులు లంకానగరములోనికి ప్రవేశించారన్న వార్తను ఆతని చెవిలో వేసాడు. వెంటనే రావణుడు అశోకవనమునుండి వెళ్ళిపోయాడు. ఇటువంటి శూన్య పనులను ఎవరు చేయుస్తారో వారు అక్కడ ఖచ్చితంగా ఉండితీరాలి. లేనిపక్షంలో ఆ శూన్యకార్యము పనిచేయదు. రావణుడు అచ్చట లేకపోవడంతో ఆ మాయ విడిపోయి అచ్చోటనుంచ బడిన తల మాయమైపోయింది. శరమ అనబడు రాక్షసి (ఈమె సీత వద్దనున్న కాపలాదారులలో నొక్కతిగనున్న విభీషణుని భార్య) ఈ శూన్యకార్యమును గూర్చి సీతకు వివరించగ ఆమె మనసు కుదుటపడింది.

- సశేషం

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**గుకారశ్చ గుణాతీతో రూపాతీతో రుకారకః**
**గుణ రూప విహీనత్వా ద్గురురిత్యభి ధీయతే.** 46

**<u>పదవిభాగము</u>** :-

గుకారః చ-గుణాతీతః-రూపాతీతః-రుకారకః-గుణరూప విహీనత్వాత్-గురుః-ఇతి-అభిధీయతే.

**<u>టీక</u>** :- గుకారః చ='గు' అనే అక్షరం అంటే; గుణాతీతః=గుణములను అతిక్రమించిన వాడని; రుకారశ్చ='రు' అనే అక్షరం అంటే, రూపాతీతః =రూపాతీతుడని; గుణరూప విహీనశ్చ= గుణరూపములు లేని వాడుగనుక; గురుఃఇతి=గురువని; అభి ధీయతే=పిలువబడుచున్నాడు.

**<u>వ్యాఖ్య</u>** :- " 'గు' అంటే గుణాతీతుడు, 'రు' అంటే రూపాతీతుడు, గుణములు, రూపము లేనివాడు గనుక "గురు"వని పిలువబడుతున్నాడు". గుణాతీతుడంటే ఏమిటి? "గుణములను దాటినవాడు" అని అర్థం. అలాగే 'రూపాతీతుడు' అంటే రూపములను దాటినవాడు. గుణరూపములు ఉంటేనే అతీతముగా ఉన్నాడా? గుణములు లేకపోతే గుణాతీతుడుగా ఉన్నాడా? గుణములు ఉంటేనే గుణాతీతుడు కావటానికి అవకాశమున్నది. అలాగే రూపం ఉంటేనే రూపాతీతుడు కాగలడు. మరి **"గుణ రూప విహీనత్వాత్ గురురిత్యభి ధీయతే"** అనటం ఎలా కుదురుతుంది? అవిద్య, అజ్ఞానము, మాయ, గుణము, రూపము మొదలైనవి ఉన్నాయా లేవా అని ప్రశ్నించేటప్పుడు "ఎప్పుడు?" అనే విషయం మనస్సులో ఉంచుకోవాలి. బ్రహ్మం ఒక్కటే పారమార్థిక సత్యం, పారమార్థిక దృష్టిలో చూస్తే యివేవీ లేవు. లేకపోతే యివి ఎలా వచ్చాయి? వ్యవహారంలో వచ్చాయనాలి. కనుక యివి వ్యావహారికముగా సత్యములే కనుక యీ ప్రయోగములు విరోధా భాసములే గాని, విరోధములు కావు, శిష్యుడు తనను తాను జీవునిగా భావించినంత వరకూ గుణాలు ఉన్నాయి. కనుక గురువును గుణిగానే చూస్తాడు, అందువల్లనే ''నిర్గుణుడు'' అనే పదానికి భగవద్రామానుజులు "అనంత కల్యాణ గుణములు కలవాడు" అని అర్థం

చెప్పారు. కనుక తాత్త్వికంగా గురువు నిర్గుణుడు, కాని "**నాऽద్వైతం గురు సన్నిధౌ**" అను వాక్యమును బట్టి గురువును సగుణమూర్తిగానే శిష్యుడు ఉపాసించాలి.

**గుకారః ప్రథమో వర్ణః మాయాది గుణభాసకః**
**రుకారోऽ స్తి పరం బ్రహ్మ మాయా భ్రాంతి విమోచకమ్. 47**

**<u>పదవిభాగము</u>** :-

గుకారః-ప్రథమోవర్ణః-మాయా-ఆది-గుణ-భాసకః-రుకారః-అస్తి-పరం-బ్రహ్మ-మాయా-భ్రాంతి-విమోచకః

**<u>టీక</u>** :- ప్రథమఃవర్ణః=మొదటి అక్షరమగు; గుకారః=గు అనే అక్షరము; మాయాది=మాయ మొదలైన; గుణ=గుణములను; భాసకః=భాసింపజేయును; రుకారః=రు అను అక్షరము; పరంబ్రహ్మః=పరబ్రహ్మము; మాయా భ్రాంతి=మాయా; భ్రాంతి=మొదలగు వానిని విమోచకం=తొలగించునది.

**<u>వ్యాఖ్య</u>** :- "'గురు' శబ్దములో మొదటి యక్షరమగు 'గు'కారము మాయ, అవిద్య, అజ్ఞానము మొదలైన గుణములను తెలియజేయగా, రెండవ యక్షరమగు 'రు'కారము మాయాదులను తొలగించు పరబ్రహ్మమును తెలియజేయును" అని గురు శబ్దాన్ని వివరిస్తున్నాడు మహేశ్వరుడు. మూర్తమైన జగత్తునూ, అమూర్తమైన ఈశ్వరునీ రెండిటినీ తనలోనే కలిగియున్న జీవునికి నిత్యా నిత్య వివేకమును కలిగించి మాయ నుండి విముక్తిని ప్రసాదించువాడు గురుదేవుడని వివరించబడుతున్నది. రజ్జువును చూచి పాముని భయపడెడు వానికి దీపకాంతిలో రజ్జువును రజ్జువని తెలుసుకొన్నపుడు భయ కంపాదుల నుండి ఎలా విముక్తి కలుగుతుందో గురు బోధ వలన అలా సత్య సాక్షాత్కారమై మాయ నుండి విముక్తి కలుగుతుంది, జగత్తు వ్యావహారికముగ ఉన్నది. కాని అది మిధ్య అని తెలుసుకొన్న వానికి దానిపై వ్యామోహము నశించును, అట్లే గురు కృప వలన సత్యావగాహన కల్గిన శిష్యునకు "జీవసృష్టి" అనగా మిధ్యయైన జగత్తుపై తనకు తానుగా అనాదిగా కల్పించుకున్న రాగద్వేష రూప భావ జగత్తు నశించి తనను తాను పరబ్రహ్మముగా తెలుసుకుంటాడు.

- సశేషం

(గత సంచిక తరువాయి) **గురుకృప** కీ.శే.- వై. లక్ష్మీనరసమ్మ

"ఇంక 14 రోజులలో శ్రీబాబు ఈ అవతారమును త్యజించుతూ కూడా మాకు చివరి దర్శన, స్పర్శన, సంభాషణ, వందన భాగ్యం అనుగ్రహించిన మన హృదయబాబు అపార కృపారసమును ఎట్లు వివరింపగలను?! శ్రీబాబు నిలిపిన విశ్వాసము మా యందు క్షణక్షణాభివృద్ధిగా పెరగాలి, నిలవాలి అని ఆ దయామూర్తినే నిరంతరం ప్రార్థిస్తున్నాను" అని కాళీ వ్రాసుకున్నారు.

1992లో నరసమ్మగారు రాచూరులో ఉద్యోగం చేస్తున్నారు. అది ఒక మారుమూల పల్లెటూరు, అక్కడ ఇళ్ళు కూడా దూరం దూరంగా ఉండేవి. ఒకనాటి అర్ధరాత్రి 2 గంటలకు వారు ఉంటున్న ఇంటి కిటికీ దగ్గరకు ఒక కోకిల వచ్చి బిగ్గరగా కూయడం మొదలు పెట్టింది. ఆ ధ్వనికి నరసమ్మగారికి, కాళీకి నిద్ర నుంచి మెలకువ వచ్చి దానిని ఎన్నిసార్లు అదిలించినా అది వెళ్ళిపోక మళ్ళీ, మళ్ళీ వచ్చి కూస్తూ అక్కడే ఉండిపోయింది. కోకిల కూస్తోంది తెల్లవారిందేమో అని అనుకొని లేచి లైట్స్ వేయగా ఎవరో ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయతించినట్లు అన్ని తలుపులు తెరచి, అన్ని కిటికీల ఊసలు తీసిపడేసి ఉన్నాయి. ఆ దొంగ ప్రయత్నాన్ని ఆపి ఆ గండం నుంచి వాళ్ళకి రక్షణ కల్పించారు శ్రీబాబు.

కాళీకి తన కొడుకు (సుబ్రహ్మణ్యం బాబు) పుట్టు వెంట్రుకలు తీయించడానికి తిరుపతి వెళ్ళాలా, ఏం చేయాలి అని ఆమె మధన పడుతుంటే ఒకరోజు శ్రీబాబు కలలో కనిపించి, "వాడు ఏడుకొండల వాడైతే, వీడు (తమను తాము చూపించుకుంటూ) ఎవడు?" అని రెండుసార్లు అన్నారు. అది శ్రీబాబు ఆజ్ఞగా భావించి ఆశ్రమంలోనే పుట్టు వెంట్రుకలు తీయించారు. "అక్షరాభ్యాసం అందరూ విజయదశమి నాడు చేయిస్తారు కదా, మేము ఆ సమయానికి వెళ్ళలేకపోయామే" అని కాళీ బాధపడుతుంటే కార్తీక శుద్ధ ఏకాదశి గురుపూజకి వచ్చినప్పుడు అమ్మ (శ్రీ మాతాజీ) పిల్లవాడికి అక్షరాభ్యాసం చేశారు.

2012లో సుబ్రహ్మణ్యం బాబు ఇంటరు అయ్యాక 'లా' చదవడానికి ఎంట్రన్సు పరీక్ష (క్లాట్) కోసం కోచింగ్‌కు వెళ్ళినప్పుడు కాళీకి శ్రీబాబు కలలో కనిపించి, "వీడు ఏం చదువుతున్నాడు?!" అని అడుగగా కాళీ, "క్లాట్ కోచింగ్ తీసుకుంటున్నాడు బాబు" అంటే శ్రీబాబు, "క్లాటా!!!" అని అన్నారు. శ్రీబాబు ఇలా అన్నారు ఏంటా అని ఆవేదన పడుతూ వుంటే పిల్లవాడికి విశాఖపట్నంలోని లా యూనివర్సిటీలో 5ఏళ్ళ కోర్సులో సీటూ రావడం, జాయిన్ అవడం కూడా జరిగింది. కానీ హాస్టల్లో తిండి సరిగ్గా పడక

అక్కడ నుంచి వచ్చేశాడు. "రెండు సంవత్సరాల చదువు వృధా అవుతోంది, ఎవరిని అడిగినా మళ్ళీ మొదటి నుంచి మొదలు పెట్టాలి అని అంటున్నారు కానీ ఎవరు సరైన దారి చూపడం లేదు బాబు" అని కాళీ మధనపడుతుంటే "కాకినాడలో లా కాలేజీ వుంది అక్కడ ప్రయత్నించండి" అని ఎవరో తెలుపగా వెళితే అక్కడ ప్రిన్సిపాల్ "సీటు వస్తుంది కానీ, అక్కడ సిలబస్, ఇక్కడ సిలబస్ చాలా తేడా ఉంది కాబట్టి అబ్బాయికి 3వ సంవత్సరంలోకి సీటు కావాలి అంటే రెండు సంవత్సరాల పరీక్షలు కలిపి 20 సబ్జెక్ట్స్ రాసి పాసైతే సీటు వస్తుంది" అంటే ఈ మార్గం చూపిన శ్రీబాబే పరీక్షలు రాయించి, సీటు ఇప్పిస్తారు అని ఆయన మీదే భారం వేసి పరీక్ష రాశాడు బాబు. అలాగే అతను పాసవ్వడం, సీటు రావడం కూడా జరిగింది. తనని నమ్ముకున్న వారిని ఆదుకునే భక్తవత్సలుడు శ్రీబాబే తన మొర విని ఏదో కీడు తీసి ఈ రూపాన దారి చూపారు అని గ్రహించి కాళీ మనస్సులోనే శ్రీబాబుకు నమస్కరించుకున్నది.

2013లో కాళీ వాళ్ళ అబ్బాయికి ఉపనయనం ఆశ్రమంలో చేయదలచి ఆమె భర్త (సూర్య సుబ్రహ్మణ్యం) అమ్మ(శ్రీ మాతాజీ) యొక్క అనుమతి అడగమని ఫోను చేయమంటే. "అమ్మని కలిసి అనుమతి తీసుకోవాలి కానీ ఫోనులో అడగడం భావ్యం కాదు" అని కాళీ అంటే "అమ్మ ఆశ్రమంలో ఉన్నారా అని లాండ్ ఫోనుకు చేస్తే ఎవరైనా విషయం చెప్తారు కదా!!" అని ఆమె భర్త అన్నారు. కాళీ అలాగే అమ్మ మీదే భారం వేసి ఫోను చేయగా, "హలో నేను మండపేట నుంచి కాళీని" అంటుండగానే "చెప్పమ్మా కాళీ నేను మాతాజీనే మాట్లాడుతున్నా" అని కాళీకి ఆనందాశ్చర్యాలు కలిగించారు. ఆ ఒక మాటతో అప్పటి వరకు కాళీ మనసులో పడుతున్న భయాన్ని, ఆరాటాన్ని కూడా తొలగించారు.

కాళీ మాట్లాడుతూ "అమ్మా! మా వాడికి ఉపనయనం ఆశ్రమంలో చేద్దాం అనుకుంటున్నాము" అంటే "అలాగే తప్పకుండా చేయండి, ఎంతమందిని పిలుస్తారో పిలవండి, నే భోజనం పెడతాను" అని అమ్మ అంటే శ్రీబాబే ఆనాడు నరసమ్మగారితో "ప్రతి చిన్నది నేను చేస్తుంటే నీకు భయం ఎందుకు" అని చెప్పిన మాట నిజం చేస్తూ ఈనాడు శ్రీబాబు అమ్మరూపంలో ఇలా ప్రేమను వర్షింపచేస్తున్నారు. అలాగే ఉపనయనం కూడా తృప్తిగా జరిపించారు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## గుంటూరు భక్తులతో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

"భగవానుడు పరమ దయామయుడు. జగత్పిత. సర్వభూతమయుడైన ఆ ప్రభువు భూత తృప్తి ద్వారానే, జీవకోటికి చేసే సేవ ద్వారానే తృప్తి పొందుతాడు. భక్తుల ద్వారా భగవానుడు విశేషంగా వెల్లడి అవుతాడు. భక్తుల యందు నెలకొన్న భగవద్భక్తి ప్రభావం వలన వారిలో సహజంగానే దివ్య తేజస్సు, ప్రశాంతి, సహజమైన ఆనందము చూచే వారిని ఆకర్షించి తీరుతాయి. అవే భగవల్లక్షణాలు. కనుకనే "**భక్తానాం హృదయాంభోజే, విశేషేన ప్రకాశతే**" అని భగవంతుని గురించి శాస్త్రాలు వర్ణిస్తున్నాయి. అందువలన భక్తులకు చేసే సేవ భగవంతునికే చేసినట్లవుతుంది.



పసి పిల్లవాడు తన తల్లి ఎక్కడకు వెళ్ళినా, ఆమెను విడువక కొంగు పట్టుకొని వెడతాడు. అలాగే నన్ను నమ్ముకొని ఉన్న నా భక్తులు నేనెక్కడికి వెడితే అక్కడికి వచ్చేస్తారు. నేను వారిని ఎలా కాదనగలను? నన్ను పిలిచే వాళ్ళు కూడా నా మీద ఎంతో ప్రేమతో పిలుస్తారు. వారి పిలుపునూ కాదనలేను. వెళ్ళకుండా ఉండలేను. నాతో రాకుండా నా పిల్లలు ( నా భక్తులు) ఉండలేరు.

అందువలన నన్ను ఆహ్వానించే భక్తులను నేను కోరేది ఒక్కటే. నా కోసం వచ్చిన భక్తులను యథాశక్తిగా, ఆప్యాయంగా ఆదరించండి. మీరు వారికి చేసిన సేవనంతటిని నాకు చేసిన సేవగా స్వీకరించి ఆనందపడతాను. నా కోసం మీరు ప్రత్యేకంగా ఏమీ చేయవలసిన పని లేదు. నా భక్తుల కోసం మీరు ఏ మాత్రం చేయ గలిగినా అది నాకు ఎంతో తృప్తినిస్తుంది. అందువలన నన్ను నా భక్తులలో చూసి సేవ చేసుకోండి. నా భక్తులున్న చోట నేను తప్పక ఉంటాను. మీకు దొరుకుతాను."

శ్రీ బాబును తమ యింటికి విచ్చేయమని ఆహ్వానించే ప్రతి భక్తునికి శ్రీ బాబు యిచ్చిన సందేశమిదే. కోరిన కోరిక యిదే. భారతీయ సనాతన సంప్రదాయంలో, వేదంలో విధించినట్లుగా '**అతిథి దేవో భవ**' అనే నియమాన్ని శ్రద్ధగా పాటించే వారు యిప్పటికీ ఉన్నారు. కాని ఒకరిద్దరు అతిథుల విషయంలోనే కాకుండా, ఒకటి రెండు రోజులు మాత్రమే కాకుండా, ఎందరు వచ్చినా, ఎన్ని రోజులున్నా, తరగని ఆప్యాయత తోను, చెరగని ఆత్మీయతతోను అతిథి ధర్మమును చిత్త శుద్ధితో పాటించగలగటం సామాన్య విషయం కాదు.

అలా యీ ధర్మాన్ని పాటించిన శ్రీ బాబు భక్తులలో భీమవరం తాతయ్యగారిని గురించి తెలుసుకున్నాము. అదే విధంగా ఆ నియమాన్ని అప్పటినుంచి యిప్పటివరకు పాటిస్తున్న వారిలో మాజేటి పున్నయ్యగారు, తూనుగుంట్ల వీర రాఘవయ్య గారి కుటుంబములు, వారి సంతతి వారు ప్రముఖులు. వారికి "అతిథిదేవో భవ" అనే వాక్యము వేదంలో ఉన్న విషయం తెలియక పోవచ్చునేమో కాని వేదములకు కూడా ప్రమాణమైన 'గురువాక్యము' గనుకనే వేదవాక్యము వలె అత్యంత శ్రద్ధాభక్తులతో యిప్పటికీ శిరోధార్యంగా అచరిస్తున్నారు.

"తొలి పరిచయాలు" అన్న అధ్యాయంలో 'గుంటూరు' అన్న శీర్షిక క్రింద, శ్రీ మాజేటి పున్నయ్యగారు, శ్రీ తూనుగుంట్ల వీరరాఘవయ్యగారు శ్రీ బాబును అన్నా కోటిలింగం గారింటి నుంచి తమ యింటికి అహ్వానించి తీసుకొని వెళ్ళిన విషయం ప్రస్తావనకు వచ్చింది. వారు శ్రీ బాబును ఆహ్వానించింది మొదట్లో కేవలం వారి సంతానం యొక్క ఆరోగ్య సమస్యలను గురించే అయినా, ఆ తరువాత శ్రీ బాబు వారింట్లో ఒక కుటుంబ సభ్యునివలె అయిపోయారు.

శ్రీ బాబు వారింటికి రావటంతోనే పున్నయ్య గారి జ్యేష్ఠ కుమారుడు గోపాల శ్రీశైలరావుకు( ఏడాది పిల్లవాడు) సంక్రమించిన పోలియో వ్యాధిని వదిలించారు. వారి కుటుంబములు రెండూ చాలా కాలం కలిసే ఉండేవి. పిల్లలు పుట్టినపుడల్లా శ్రీ బాబుతో సహా వారందరూ శ్రీశైలం గాని, పండరీపురం గాని వెళ్ళి అక్కడ శ్రీ బాబు చేత తమ పిల్లలకు నామకరణము, కేశ ఖండనము మొదలైనవి చేయించేవారు.

పున్నయ్య గారి కుమారులు గోపాల శ్రీ శైలరావు, పాండురంగనాథ్, విఠల్ రావు, కుమార్తెలు, రుక్మాబాయి, లక్ష్మీబాయి. వీరరాఘవయ్యగారి కుమారులు పాండురంగ శ్రీశైలరావు, విఠల్ రామారావు. కుమార్తెలు కృష్ణాబాయి, రాధాబాయి. వారు పండరీపురంలో తమ పిల్లలను 'పాలకోవా'తో తూయించి, ఆ కోవాను శ్రీ పాండురంగ స్వామికి నివేదన చేసి, భక్తులందరికి పంచిపెట్టే వారు. పలకరిస్తే పలికే పాండురంగణ్ణి (శ్రీ బాబును) వెంట తీసుకొని వెళ్ళిన వారికి పంటలన్నీ పండరీ పురంలోనే పండేవి. తూనుగుంట్ల వీరరాఘవయ్యగారి ధర్మపత్ని పాపాయమ్మగారు (కనక మహాలక్ష్మమ్మగారు), వారి అక్కగారైన బచ్చు కాంతమ్మగారికి సంతానం లేనందున తమ పెద్ద కుమారుడు పాండురంగ శ్రీశైలరావును దత్తతు యిచ్చారు. కాంతమ్మ గారు భర్తృ వియోగం వలన పాపాయమ్మగారితోనే ఉండేవారు.

- సశేషం

# పూరి - కామాఖ్య యాత్ర - పాలూరి ప్రసాద్

2026 ఏప్రిల్ 26 నుండి మే 12 వరకు శ్రీ కాళీవనాశ్రమ భక్తులనేకులతో కలిసి శ్రీ సద్గురు బాబూజీ పూరీ కామాఖ్య యాత్ర చేయడం జరిగింది. ఈ యాత్రలో భాగంగా కోణార్క్ సూర్య దేవాలయం, పూరీ జగన్నాధ దేవాలయం, సాక్షి గోపాలుడు, జాజిపూర్ గిరిజాదేవి, భువనేశ్వర్ లింగరాజ్, కలకత్తా కాళీమాత, దక్షిణేశ్వర్ కాళీమాత, బేలూరు మఠం, గంగాసాగర్, మాయాపూర్ లోని ఇస్కాన్ ప్రధాన దేవాలయం, శ్రీ చైతన్య మహాప్రభువు నడయాడిన నవద్వీపం, వైద్యనాథ్, తారకేశ్వర్, శృంఖలా దేవి, మా తారా, ఏకచక్రపురం, కామాఖ్య, ఉమానందాశ్రమం, వశిష్ఠాశ్రమం మొదలైన ఎన్నో దివ్య క్షేత్రాలను దర్శించడం జరిగింది.



ఆయా క్షేత్రాలలో క్షేత్రాధిష్ఠాన దేవతల మాహాత్మ్యమే కాకుండా క్షేత్రజ్ఞులైన జగద్గురువులు శ్రీ ఆది శంకర భగవత్పాదాచార్యుల వారి దగ్గరనుండి గురుదేవులు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వరకు ఎందరో మహాత్ములు నడయాడిన ఫలితంగా అలముకొన్న పవిత్రత అనుభవైకవేద్యం. కోణార్క్ సూర్య దేవాలయం మన ప్రాచీన శిల్పకారుల ప్రతిభకు అద్దం పడుతుంది. అయితే అప్పటినుండి ఇప్పటివరకు పాలకులు ఆడంబరానికి ఇచ్చిన ప్రాముఖ్యత మానవతా విలువలకు ఇవ్వడంలేదని అక్కడి విషాద చరిత్ర మనకు గుర్తుచేస్తుంది. అయితే పరమాత్మకు కావలసింది ఆడంబరాలు కాదు కదా! అందుకే ఈ దేవాలయం పూజలకు నోచుకోలేకపోయింది. సరిగ్గా పన్నెండు సంవత్సరాలలో ఆలయ నిర్మాణం పూర్తి చేయకపోతే అక్కడ పనిచేస్తున్న పన్నెండు వందలమంది శిల్పులను వధిస్తానని అక్కడి రాజు శాసించాడు. అయితే ఆలయం అంతా నిర్మించిన వారికి శిఖరాన్ని స్థాపించడం మాత్రం సాధ్యపడలేదు. చివరి రోజున ప్రధాన శిల్పి పన్నెండేళ్ళ కుమారుడు వచ్చి దానిని స్థాపించడం, ఈ విషయం రాజుగారికి తెలిస్తే ఎక్కడ ఇంతమందిని పొట్టన పెట్టుకుంటాడో అని భయపడి ఆ శిఖరం మీదినుండే దూకి ఆత్మహత్య చేసుకోవడం జరిగిపోయింది. దానితో అపవిత్రమైన అంతటి భవ్యమైన ఆలయం పూజలకు నోచుకోలేకపోయింది.

- సశేషం


విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

# త్రైలింగ స్వామి

ఆ నావలో యాత్రికులతో బాటు స్వామి కూడా దిగడం చూసి ఆశ్చర్యపోయాడు. యాత్రికులు తమతో పాటు అపరిచిత దిగంబర వ్యక్తి దిగటం చూసి ఆశ్చర్యపోయారు. తమ నావ ఏవిధంగా ఒడ్డుకు చేరుకుందో వారికి తెలియనే తెలియదు. రామతారక భట్టాచార్య ఇదంతా అర్థం చేసుకుని స్వామి పాదాలపై పడ్డాడు. స్వామిపాద ధూళి స్వీకరించి నొసట ధరించి ఏదో అనబోయేటంతలో స్వామి "బాబూ! ఈ సంఘటను చూసి ఎందుకు ఆశ్చర్యపడుతున్నావు? ఇందులో నీవు ఆశ్చర్యపడవలసినది ఏమీ లేదు. ఇటువంటి శక్తి నీలో కూడా ఉంది. అందరిలోను ఉంది. మనుష్యులంతా సాంసారిక సుఖాలలో మునిగి తమ అత్యున్నత స్థితిని గురించి ఆలోచించటం లేదు. నువ్వు అనవసరంగా వర్షంలో తడుస్తున్నావు" అని చెప్పి అదృశ్యులైనారు.



గణపతి స్వామి 1737లో వారణాసి చేరారు. గణపతి స్వామి తన 130వ ఏట కాశీ ప్రవేశించి ఆ పట్టణంలో 150 ఏళ్ళు సంచరించారు. స్వామివారు అనేక తావుల్లో, గంగా ఘాట్‌లో యోగ సాధన చేశారు. 300 పౌన్ల దీర్ఘకాయంతో దిశమొలతో, పెద్ద రుద్రాక్షమాలతో కాశీలో తిరుగుతూ వుంటే ఆయనను "సచల విశ్వనాధుడ"నేవారు. గంటల తరబడి గంగాతరంగాలపై తేలియాడేవారు.

కాశీలో తొలి బస అసిఘాట్ వద్దగల తులసీదాసు తోట. అక్కడ అజ్మీరు నివాసి అయిన బ్రహ్మసిన్హా అనే చెవిటివాడు కుష్టురోగంతో బాధ పడుతుంటే స్వామి అతనిని తట్టిలేపి 'లోలార్క కుండంలో స్నానం చేసి ఈ బిల్వపత్రం ధరించ'మని చెప్పారు. బ్రహ్మసిన్హా రోగం మటుమాయమైంది.

స్వామి అక్కడనుండి వేదవ్యాసాశ్రమం చేరారు. అక్కడ సీతానాథ బంధోపాధ్యాయ అనే క్షయరోగికి ఆరోగ్యం ప్రసాదించి హనుమాన్ ఘాట్ చేరారు. అక్కడ ఒక మహారాష్ట్ర స్త్రీ, రోగగ్రస్తుడైన భర్తతో ఉంటూ, అతని ఆరోగ్యం కోసం రోజూ కాశీవిశ్వేశ్వరునికి అభిషేకంచేసి వస్తూ ఉండేది. కొత్తగా వచ్చిన ఈ దిగంబర స్వామిని చూసి ఆమె అసహ్యించుకొంది. "దిగంబరిగా ఉండే వాడవు అడవులలో ఉండక జనాల మధ్య, అందులో స్త్రీల ఎదుట ఎందుకు తిరుగుతున్నావు?" అని తూలనాడింది. స్వామి పట్టించుకోలేదు. విశ్వేశ్వరుడు ఆమెకు కలలో కనబడి "దిగంబర స్వామిని ఆశ్రయించు. నీ భర్త రోగం నయమవుతుంది" అని చెప్పాడు. ఆమె భర్త దీర్ఘకాలంగా ఆంత్ర వ్రణంతో బాధ పడుతున్నాడు. గత్యంతరం లేక ఆమె తను తూలనాడిన దిగంబర సన్యాసిని క్షమాభిక్ష వేడి తన భర్త ప్రాణాలు రక్షించమని ప్రార్థించింది. స్వామి ప్రసన్నులై విభూతి ప్రసాదంగా ఇచ్చారు. ఆమె భర్త రోగం పూర్తిగా నయమయింది.

స్వామి దశాశ్వమేధ ఘాట్ చేరారు. అక్కడ రాంపూర్ వాసి శివప్రసాద్ కొడుకు పక్షవాతంతో బాధపడుతుంటే స్వామి తన చేతులతో కాయకల్ప చికిత్స చేయగా అతనికి నయమై స్వామి భక్తుడైనాడు. స్వామి మహిమలు వారణాసి అంతటా వ్యాపించాయి. స్వామి సన్నిధికి జనాలు తండోపతండాలుగా వచ్చేవారు. చాలామంది తీపి ప్రసాదాలు తెచ్చి ఆరగింప చేసేవారు.

స్వామి 1800లో పంచ గంగా ఘాట్‌లోని బిందుమాధవ లోకి తమ బస మార్చారు. మహాసమాధి అయ్యేంతవరకు మౌనవ్రతం పాటించారు. ఆయనను కొందరు 'మౌనబాబా' అని పిలిచేవారు. అంబాదేవి అనే మహారాష్ట్ర మహిళ స్వామికి వంట చేసి పెట్టేది. ఆమె కొడుకులు మంగళదాస్, కృష్ణప్రసాద్ స్వామికి సేవ చేసేవారు.

- సశేషం

Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## ఏప్రియల్ 26 నుండి మే 12 వరకు జరిగిన పూరీ-కామాఖ్య యాత్ర దృశ్యములు



కోణార్క్‌లో భక్తులతో శ్రీ మాతాజీ



జాజిపూర్-గిరిజాదేవి ఆలయం వద్ద



గంగాసాగర్ వద్ద



వైద్యనాథ్ జ్యోతిర్లింగ దర్శనం

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## ఏప్రియల్ 26 నుండి మే 12 వరకు జరిగిన
## పూరీ-కామాఖ్య యాత్ర దృశ్యములు



ఇస్కాన్ గుడి,
మాయాపూర్



అష్టాదశ శక్తి పీఠం
కామాఖ్య
ఆలయం,
గౌహతి



దక్షిణేశ్వర్,
కలకత్తా

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.